# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 7

సోమవారం, జులై 3, 2023

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD


## రేపు హైదరాబాద్‌కు రాష్ట్రపతి ముర్ము

### అల్లూరి 125వ జయంతి ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో ప్రసంగం



**ఆల్వాల్, జూలై 2, (వాయిస్ టుడే):** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం తెలంగాణకు రానున్నారు. హైదరాబాద్‌లో జరిగే 'అల్లూరి సీతారామరాజు 125వ జయంతి ఉత్సవాల ముగింపు కార్యక్రమం'లో ఆమె ప్రసంగించనున్నారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం నుంచి ఐదు రోజుల పాటు(7వ తేదీ వరకు) తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలో పర్యటిస్తారని అందులో పేర్కొంది. రాష్ట్రాల పర్యటనలో భాగంగా ఆమె రెండు యూనివర్సిటీల స్నాతకోత్సవాల్లో పాల్గొననున్నారు. ఇదిలా ఉండగా, రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఇప్పటికే వివిధ విభాగాల అధికారులతో సచివాలయంలో సమావేశమయ్యారు.

## కాంగ్రెస్ సభపై ఆంక్షలు తగదు..

### కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆగ్రహం...



**ఖమ్మం/హైదరాబాద్, జూలై 2, (వాయిస్ టుడే):** కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఖమ్మంలో నిర్వహిస్తున్న జనగర్జన సభకు ప్రభుత్వం అడ్డంకులు సృష్టించడం కరెక్ట్ కాదు. రాహుల్ గాంధీ గారి సభకు అడుగడుగునా ఆంక్షలు విధించడమేంటి? 4 నెలల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుంది. కేసీఆర్‌ను చెప్పేది ఒక్కటే.. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలకు పోరాటాలు, సభలు, ధర్నాలు చేసుకునే హక్కు ఉంది. ఖమ్మంలో కాంగ్రెస్ సభకు నిన్న రాత్రి నుంచి ఆంక్షలు పెట్టారు.. అక్రమ అరెస్టులు చేస్తున్నారు. ఆర్టీసీ వాహనాలను డబ్బులు కడతామన్నా ఇవ్వలేదు. సరే అని ప్రైవేట్ వాహనాల్లో జనం సభకు వెళ్తుంటే అడ్డుకుంటున్నారు. ఎక్కడ మీటింగ్ పెట్టుకున్నా.. ఆర్టీసీ బస్సులు వాడుకోవడం జరుగుతూ ఉంటుంది. కాంగ్రెస్ సభకు భయపడి ప్రభుత్వం బస్సులను ఇవ్వలేదు. పైగా కక్ష కట్టి ప్రైవేట్ వాహనాలను ఆపి పోలీస్ స్టేషన్లకు 2లో

## ఏఐసీసీ అంటే..
## ఆల్ ఇండియా కరప్షన్ కమిటీ



**భారత రాబందుల పార్టీ కాంగ్రెస్.. మేం ఎవరికీ బీ-టీం.. సీ-టీం కాదు**

**కాంగ్రెస్ బీజేపీ రెండు పార్టీలను ఢీ కొట్టే 'ఢీ-టీం' బీఆర్ఎస్**

**కర్ణాటకలో అన్నభాగ్యను గంగలో కలిపి ఇక్కడ 4వేల పెన్షన్ అంటరా?**

**లక్ష కోట్లు ఖర్చేకాని ప్రాజెక్టులో లక్షకోట్ల అవినీతా?**

**రాహుల్‌పై మంత్రి కేటీఆర్ ఫైర్**

**హైదరాబాద్, జూలై 2, (వాయిస్ టుడే):** 'ఏఐసీసీ అంటే అఖిల భారత కరప్షన్ కమిటీ. మాది బీజేపీ బంధువుల పార్టీ కాదు.. మీదే భారత రాబందుల పార్టీ. దేశంలో అవినీతికి, అసమర్థతకు కేరాఫ్ అడ్రస్.. కాంగ్రెస్' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఖమ్మం సభలో రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలపై ట్విట్టర్ వేదికగా మంత్రి నిప్పులు చెరిగారు. 'సాములే తాచుపాములై.. మీ యూపీఏను.. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌ను దిగమింగిన చరిత్రను ప్రజలు 2లో

## కాంగ్రెస్ కాదు.. స్కాంగ్రెస్

**దేశాన్ని దోచుకున్న చరిత్ర మీది పంచిన పోడు పట్టాలను మళ్లా మీరెలా పంచుతారు?**

**బీజేపీ కబంధ హస్తాల నుంచి దేశాన్ని కాపాడేది బీఆర్ఎస్సే.. రాహుల్‌పై మంత్రి హరీశ్ ఫైర్**



**హైదరాబాద్, జూలై 2, (వాయిస్ టుడే):** 'రాహుల్‌గారూ దేశాన్ని దోచుకున్న చరిత్ర మీది.. అందుకే మీ పార్టీ పేరు కాంగ్రెస్ నుంచి స్కాంగ్రెస్‌గా మారిపోయింది' అని కాంగ్రెస్ జాతీయ నేత రాహుల్‌గాంధీపై మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారడం వల్లే దేశప్రజలు మిమ్మల్ని అధికారం నుంచి దించి మూలన కూర్చోబెట్టారని ఎద్దేవా చేశారు. ఖమ్మం కాంగ్రెస్ సభలో రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలపై ట్విట్టర్ వేదికగా మంత్రి హరీశ్‌రావు విరుచుకుపడ్డారు. 'బీఆర్ఎస్ ఎవరికీ బీ టీం కాదు.. మాది పేద ప్రజలకు 'ఏ' టీం. ప్రజల సంక్షేమం చూసే 'ఏ క్లాస్' టీం. బీజేపీని ఎదురొనే సత్తా కాంగ్రెస్‌కు లేదు. అందుకే దేశాన్ని బీజేపీ కబంధ హస్తాల నుంచి కాపాడేందుకే బీఆర్ఎస్ పుట్టింది' అని స్పష్టం చేశారు. 'రాష్ట్రంలో పోడు పట్టాల పంపిణీ 2లో

## రైల్వే ప్లాట్‌ఫాంపై అప్రమత్తంగా ఉండాలి

**హైదరాబాద్, జూలై 2, (వాయిస్ టుడే):** రైల్వే ప్లాట్‌ఫాంపై అప్రమత్తంగా ఉండాలని.. రైల్ వస్తున్న సమయంలో దూరంగా ఉండాలని రైల్వే అధికారులు ఎన్నోసార్లు హెచ్చరిస్తుంటారు. కానీ కొంతమంది మాత్రం ఇవేవీ పట్టించుకోకుండా కదిలే ట్రైన్ ఎక్కడం, ఫ్లాట్ ఫామ్ వద్ద నిర్లక్ష్యంగా వ్యవహరించడం చేస్తుంటారు. అలాంటి సందర్భాల్లో రైలు ప్రమాదాలు జరుగుతుంటాయి.. అదృష్టం బాగుంటే బతికిపోతారు.. లేదంటే ఎంతో మంది చనిపోయిన ఘటనలు ఉన్నాయి. తాజాగా ముంబాయిలోని మలాడ్ రైల్వే స్టేషన్ విషాదం చోటు చేసుకుంది. మయాంక్ అనే యువకుడు ఫ్లాట్ ఫామ్ అంచున నిలబడి వెనుక వైపు వస్తున్న రైల్ ని గమనించకపోవడంతో.. వెనకవైపు నుంచి వచ్చిన ట్రైన్ యువకుడిని బలంగా ఢీ కొట్టి ప్రాణాలు కోల్పోయాడు.ముంబాయిలోని మలాడ్ 2లో





# కేసీఆర్ రిమోట్ కంట్రోల్ మోదీ చేతుల్లో

- అందుకే ప్రతిపక్షాల భేటీకి ఆహ్వానించలేదు..
- బీఆర్ఎస్‌ను ఆహ్వానిస్తే మేము రాబోమని చెప్పాం
- కేసీఆర్ అవినీతి అంతా కేంద్ర ఏజెన్సీలకు తెలుసు
- కాళేశ్వరం, మిషన్ కాకతీయలో వేల కోట్ల అవినీతి..
- ధరణితో భూములు సీఎం దోచుకుంటున్నారు
- రాష్ట్రంలో బీజేపీ బండి టైర్లు నాలుగూ పంక్చర్..
- తెలంగాణకు రాజును అనుకుంటున్న కేసీఆర్
- ఖమ్మం జనగర్జన సభలో రాహుల్‌గాంధీ..
- కాంగ్రెస్‌లో చేరిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- అవరోధాలను అధిగమించి.. జనగర్జనకు జై!..
- కాంగ్రెస్ సభకు భారీగా తరలివచ్చిన జనం



### 25 నిమిషాల పాటు ట్రాఫిక్‌లో చిక్కుకున్న రాహుల్

**ఖమ్మం కలెక్టరేట్:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆదివారం మధ్యాహ్నం 3.30కి విజయవాడ గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో సాయంత్రం 5.46 గంటలకు ఖమ్మం సభా ప్రాంగణంలోని హెలీప్యాడ్‌కు చేరుకున్నారు. 5.55కి సభావేదికపైకి వచ్చిన రాహుల్ 23 నిమిషాల పాటు ప్రసంగించారు. సభ తర్వాత రాహుల్ ప్రత్యేక కాన్వాయ్‌లో రోడ్డు మార్గాన గన్నవరం విమానాశ్రయానికి బయల్దేరారు. కాగా, రఘునాథపాలెం బైపాస్ వద్ద సుమారు 25 నిమిషాల పాటు రాహుల్ ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. కాగాసభలో మాజీ ఎంపీ పొంగులేటి మాట్లాడుతూ వేదికపై ఆసీనులైన వారి పేర్లు ప్రస్తావించారు. ఈ క్రమంలో వెనకకు తిరిగిన శ్రీనివాసరెడ్డిని.. 'మాపేర్లు మీకు తెలియవా.. ఎందుకు చెప్పడం లేదు' అని పీసీసీ మాజీ చీఫ్ వీహెచ్ అడిగి గుస్సా అయ్యారు.

"లక్ష కోట్ల కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగింది. మిషన్ కాకతీయ వేల కోట్ల కుంభకోణం. ధరణి పోర్టల్‌తో ముఖ్యమంత్రి భూములన్నీ దోచుకుంటున్నాడు. లిక్కర్ స్కాంతో పాటు ఇతర కుంభకోణాలన్నీ కేంద్ర ఏజెన్సీలకు తెలుసు. కేసీఆర్ రిమోట్ కంట్రోల్ మోదీ చేతుల్లో ఉంది. అందుకే పార్లమెంటులో బీజేపీకి మద్దతు పలుకుతున్నారు. బీఆర్ఎస్ అంటే.. బీజేపీ రిష్తేదార్ (బంధుత్వ) సమితి"

పేదలు, రైతులు, కార్మికులు, బలహీనవర్గాలకు తెలంగాణ సాధన ఒక స్వప్నంగా ఉండేది. తొమ్మిదేళ్లలో ఆ కలను బీఆర్ఎస్ నాశనం చేసింది. తెలంగాణకు తాను రాజునని, రాష్ట్రం తన జాగీర్ అని కేసీఆర్ అనుకుంటున్నారు. ఇందిరమ్మ ఇచ్చిన భూములన్నీ లాక్కుంటున్నారు. అధికారంలోకి రాగానే పేదల భూములన్నీ తిరిగి అప్పగిస్తాం. ఆదివాసీలకు పోడు భూములిస్తాం.

ఢిల్లీలో జరిగిన ప్రతిపక్షాల సమావేశంలో బీఆర్ఎస్‌ను ఆహ్వానించాలని కొన్ని పార్టీలు కోరాయి. వారి నిర్ణయాన్ని మేము తీవ్రంగా వ్యతిరేకించాం. వాళ్లను ఆహ్వానిస్తే మేము హాజరుకాబోమని చెప్పాం. బీఆర్ఎస్ పార్టీ బీజేపీకి బీ టీమ్ అని, వారితో ఎలాంటి ఒప్పందం ఉండబోదని స్పష్టం చేశాం. వచ్చే ఎన్నికల్లో వారిని ఓడించబోతున్నాం. – ఖమ్మం సభలో రాహుల్‌గాంధీ

**ఖమ్మం, జూలై 2, (వాయిస్ టుడే):** తెలంగాణలో బీజేపీ పని అయిపోయిందని, ఇక వచ్చే ఎన్నికల్లో బీజేపీకి బీ టీమ్ అయిన బీఆర్ఎసతోనే కాంగ్రెసకు పోటీ అని ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. ఇటీవలే కర్ణాటకలో బీజేపీని ఓడించామని, తెలంగాణలో ఆ పార్టీ బీ టీమ్‌నూ ఓడిస్తామని ప్రకటించారు. ఖమ్మంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన తెలంగాణ జనగర్జన సభకు రాహుల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని, పలువురు ఇతర నేతలను కాంగ్రెసలోకి ఆహ్వానించారు. సభకు భారీగా తరలివచ్చిన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. తెలంగాణ సీఎం కేసీఆర్, ఆయన కుటుంబం అవినీతి అక్రమాలు, కుంభకోణాల సమాచారమంతా కేంద్ర దర్యాప్తు సంస్థల వద్ద ఉందని రాహుల్ అన్నారు. లిక్కర్ కుంభకోణంతో పాటుఇతర అక్రమాల వివరాలన్నీ కేంద్రం వద్ద ఉన్నాయని, అందుకే కేసీఆర్ ప్రధాని ముందు తలొగ్గారని ఆరోపించారు. బీజేపీకి బీ టీమ్‌గా మారారన్నారు. బీఆర్ఎస్ అంటే.. బీజేపీ రిష్తేదార్ (బంధుత్వ) సమితి అని అభివర్ణించారు. దేశంలో ప్రజల మధ్య పెంచుతున్న విద్వేషాన్ని ఆపాలని, ప్రేమను పంచాలనే లక్ష్యంతో చేపట్టిన భారత్ జోడో యాత్రలో ఖమ్మం ప్రజలు తనకు ఎంతో సహకరించారని రాహుల్ తెలిపారు. ఇక్కడి నుంచి వచ్చి ఎంతోమంది యాత్రలో పాలుపంచుకున్నారని గుర్తు చేసుకున్నారు. వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. "యాత్రలో దేశాన్ని కలిపే విషయాలనే మాట్లాడాను. దేశాన్ని విభజించాలన్నది వారి (బీజేపీ) ఆలోచన అయితే.. దేశాన్ని కలపాలన్నది నా ఆలోచన. మొత్తం దేశం నా యాత్రను సమర్థించింది. హింస, విద్వేషాన్ని ప్రబలనివ్వబోమని దేశం చెప్పింది. ఖమ్మం కాంగ్రెస్ పార్టీకి గడ్డ. మీ ఆలోచనలు, మనసుల్లో కాంగ్రెస్ పార్టీ ఉంది. మీ అందరికీ నా ప్రత్యేక అభినందనలు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు రాష్ట్రంలో వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసినందుకు భట్టి విక్రమార్కకు అభినందనలు. పొంగులేటి శ్రీనివాసరెడ్డికి పార్టీలోకి స్వాగతం పలుకుతున్నాను. ఎన్ని కష్టాలు వచ్చినా పార్టీని వీడకుండా కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటున్న ఇక్కడి కార్యకర్తలు పోరాడే సింహాలు. అవినీతి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్నందుకు మీకు ధన్యవాదాలు" అని అన్నారు. పేదలు, రైతులు, యువకులు, నిరుద్యోగులు, మైనారిటీల కలలను బీఆర్ఎస్ ప్రభుత్వం ధ్వంసం చేసిందని ఆరోపించారు. అందుకే టీఆర్ఎస్ పేరును మార్చుకుందన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణకు తాను రాజునని, తెలంగాణ తన జాగీర్ అని అనుకుంటున్నారని విమర్శించారు. పేదలకు ఇందిరమ్మ ఇచ్చిన భూములను కేసీఆర్ లాక్కుంటున్నారని, భారత్ జోడో యాత్రలో రాష్ట్ర ప్రజలు ఈ విషయాన్ని తన దృష్టికి తెచ్చారని తెలిపారు. "ఈ భూమి ముఖ్యమంత్రిది కాదు.. మీది. ఈ భూములపై మీకే హక్కుంది. ప్రభుత్వం లాక్కున్న భూములన్నీ తిరిగి మీకు అప్పగిస్తాం. ఆదివాసీలకు పోడు భూములిస్తాం" అని రాహుల్ ప్రకటించారు. అవినీతిలో దేనినీ కేసీఆర్ వదల్లేదని ఆరోపించారు. రూ.లక్ష కోట్ల కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగిందని, ధరణి పోర్టల్‌తో భూములను దోచుకుంటున్నారని, మిషన్ కాకతీయతో వేల కోట్లు దోచుకున్నారని ధ్వజమెత్తారు. పార్లమెంటులో బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ పోరాడుతోందని, బీఆర్ఎస్ మాత్రం బీజేపీకి బీ టీమ్‌గా పనిచేస్తోందని అన్నారు. "ప్రధాని మోదీ పార్లమెంటులో ఎలాంటి నిర్ణయం తీసుకున్నా మీ ముఖ్యమంత్రి సమర్థిస్తున్నారు. ఎందుకంటే మోదీ చేతిలో కేసీఆర్ రిమోట్ కంట్రోల్ ఉంది" అని రాహుల్ వ్యాఖ్యానించారు.

### చరిత్రాత్మక నిర్ణయం.. చేయూత

కాంగ్రెస్ పార్టీ దశాబ్దాలుగా పేదల పక్షాన నిలుస్తోందని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. ఇందులో భాగంగా గతంలో వరంగల్‌లో రైతు డిక్లరేషన్, హైదరాబాద్‌లో యూత్ డిక్లరేషన్ ప్రకటించామని గుర్తు చేశారు. ఇప్పుడు ఖమ్మం వేదికగా 'చేయూత' పేరుతో మరో చరిత్రాత్మక నిర్ణయాన్ని ప్రకటించబోతున్నామన్నారు. రాష్ట్రంలో

- మిగతా 2వ పేజీలో

## కాళేశ్వరం నుంచి నీటిని ఎత్తిపోయండి

- రాష్ట్రంలో తాగు, సాగునీటికి లోటు రానివ్వొద్దు
- చుక్క చుక్క ఒడిసిపట్టి జనం చెంతకు చేర్చాలి
- వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో
- ముందస్తు చర్యలు చేపట్టండి
- ఇది ఇరిగేషన్ శాఖకు పరీక్ష కాలం
- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- రిజర్వాయర్లలో సరిపడానీరుండాలి
- ప్రాణహిత నీటిని ఒడిసిపట్టండి
- మిడ్‌మానేరుకు రోజూ టీఎంసీ నీరు
- లక్ష్మీ బరాజ్ నుంచి తరలించాలి
- ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలు
- సాగు, తాగునీటిపై ఉన్నతస్థాయి సమీక్ష

2లో



ఇన్ని రోజులు ఒక ఎత్తు. ఇప్పుడు ఒక ఎత్తు. ఇది ఇరిగేషన్ శాఖకు పరీక్ష కాలం. ఇది మునుపటి తెలంగాణ కాదు. గతంలోలాగా ఆలోచిస్తే కుదరదు. నీటిసమస్య లేకుండా ప్రాజెక్టులు కట్టుకున్నాం. తాగు, సాగు అవసరాలకు సమృద్ధిగా నీరు అందుతున్నది. ఇట్లాంటి సందర్భాలు వచ్చినప్పుడే మన సామర్థ్యాన్ని నిరూపించుకోవాల్సి ఉంటది. సంక్షోభ సమయంలోనే మనం పంటలు పండించి చూపించాలి. అప్పుడే మనం సిపాయిలం అవుతాం. – ఇరిగేషన్‌పై సమీక్షలో అధికారులతో ముఖ్యమంత్రి కేసీఆర్

### నేడు హైదరాబాద్‌కు అఖిలేశ్ యాదవ్ రాక

**ప్రగతిభవన్‌లో సీఎంతో భేటీ**

ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పీ) అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ సోమవారం తెలంగాణకు విచ్చేయనున్నారు. హైదరాబాద్‌కు చేరుకున్న అనంతరం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌తో సమావేశం కానున్నారు. దేశంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులపై ఈ భేటీలో చర్చించనున్నట్టు సమాచారం.





### మోదీ సభకు అధ్యక్షుడిగా వస్తానో రానో?

- అధిష్ఠానం నిర్ణయమే శిరోధార్యం
- కేంద్రం భారీగా నిధులిస్తోంది
- మిగతా రాష్ట్రాలకంటే మిన్నగా
- తెలంగాణకు సహకరిస్తోంది
- దురుద్దేశంతోనే దుష్ప్రచారం: కిషన్‌రెడ్డి
- వరంగల్లో మోదీ సభ ఏర్పాట్ల పరిశీలన
- బీజేపీ సారథ్యంపై కొనసాగుతున్న సస్పెన్స్

2లో

**హైదరాబాద్, జూలై 2, (వాయిస్ టుడే):** ఈ నెల 8వ తేదీన వరంగల్‌లో జరిగే ప్రధాని మోదీ సభకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో హాజరౌతానో

వాయిస్ టుడే
హైదరాబాద్
సోమవారం 3 జులై 2023

## బిఆర్ఎస్ పార్టీ పై పొంగులేటి మతిభ్రమించి ఆరోపణలు చేయడం సిగ్గుచేటు..!

**తాతా మధుసూదన్, బిఆర్ఎస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు**

**ఖమ్మం, జూలై 2, (వాయిస్ టుడే):** చిల్లర ఆరోపణలు ఆపి, ఇకనైనా హుందాగా రాజకీయాలు చేసుకోండి. ఏ వ్యక్తి స్వేచ్ఛను హరించే దుర్మార్గమైన చర్యలను బిఆర్ఎస్ పార్టీ చెయ్యబోదు. గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ గారి మార్గదర్శకత్వంలో పార్టీ విలువలతో కూడిన హుందా రాజకీయాలే చేస్తుంది. తప్పుడు ఆరోపణలు చేస్తే రాజకీయంగా బుద్ధి చెబుతాం. రేపు పొంగులేటి మొదలుపెట్టే కొత్త సంసారం విజయవంతం కాదనే బెంగతో పొంగులేటి మరియు అయిన అనుచరులు మతిభ్రమించి చేస్తున్న పసలేని ఆరోపణలను త్రిప్పి కొట్టాలని ఖమ్మం జిల్లా శ్రేణులకు మరియు జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను.

## మోదీ సభకు అధ్యక్షుడిగా వస్తానో రానో?

(మొదటి పేజీ తరువాయి)

లేదోనని బండి సంజయ్ ఆదివారం హన్మకొండలో కార్యకర్తలతో అన్నారు. రాష్ట్ర పార్టీ బాధ్యతలను బండి సంజయ్ నుంచి తప్పించి కేంద్ర క్యాబినెట్‌లోకి తీసుకుంటారని.. రాష్ట్రంలో పార్టీ అధ్యక్షుడిగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని నియమిస్తారని ప్రచారం జోరుగా సాగుతున్న నేపథ్యంలో ఆయన తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఎప్పుడూ ఉత్సాహంగా ఉంటూ పార్టీ కేడర్‌లో జోష్ నింపే ఆయన.. ఆదివారం ముభావంగా ఉండిపోయారు. 8న ప్రధాని మోదీ వరంగల్ జిల్లా పర్యటన సందర్భంగా కిషన్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులతో కలిసి అక్కడ ఏర్పాట్లను సమీక్షించిన సంజయ్.. అంటీముట్టనట్లుగా వ్యవహరించారు. వరంగల్‌లో జరిగిన మీడియా సమావేశంలో తన సహజశైలికి భిన్నంగా ముక్తసరిగా మాట్లాడారు. అనంతరం, ఎన్జీవో కాలనీలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో కార్యకర్తలు, నాయకులు సంజయ్‌కి మద్దతుగా నినాదాలు చేశారు. దీంతో, వారిని ఉత్తేజపరుస్తూ కొద్దిసేపు మాట్లాడారు. ప్రధాని సభను సక్సెస్ చేసి చరిత్ర సృష్టించాలని పిలుపునిచ్చారు. అనంతరం, కరీంనగర్ వెళ్లిపోయారు. ఒకవేళ పార్టీ రాష్ట్ర బాధ్యతల నుంచి తనను తప్పించినా.. అధైర్యపడవద్దని బండి సంజయ్ తనను అభిమానించే కార్యకర్తలు, నాయకులకు బండి నచ్చజెబుతున్నారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయమే శిరోధార్యమని స్పష్టం చేస్తున్నారు. కొద్దిరోజులుగా కొనసాగుతున్న ఈ సస్పెన్స్ త్వరలోనే తెరపడుతుందని.. పార్టీ ముఖ్యనేత ఒకరు చెప్పారు.

**ఛుగ్ ప్రకటించినా తప్పుడు ప్రచారం: విజయశాంతి**

వచ్చే ఏడాది పార్టీ సంస్థాగత ఎన్నికలు జరిగే దాకా బండి సంజయే రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా కొనసాగుతారని రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జ్ తరుణ్‌ఛుగ్ స్పష్టంగా ప్రకటించినా ఈ అంశంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మాజీ ఎంపీ విజయశాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధ్యక్ష మార్పు లేదని, నాలుగు రోజుల కిందట కూడా తరుణ్‌ఛుగ్ పునరుద్ఘాటించారని ఆమె గుర్తుచేశారు. సంజయ్‌ని మారుస్తున్నారంటూ ప్రచారం చేసేవాళ్లు, అందుకు కారణం ఏంటో మాత్రం చెప్పడం లేదని విజయశాంతి పేర్కొన్నారు. ఇక.. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడి మార్పుపై తనతో ఎవరూ చర్చించలేదని బీజేపీ పార్లమెంటరీ కమిటీ సభ్యులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ చెప్పారు.

## కాంగ్రెస్ సభపై ఆంక్షలు తగదు..

(మొదటి పేజీ తరువాయి)

తరలిస్తున్నారు. జనాన్ని కాంగ్రెస్ సభకు రాకుండా అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా.. పోలీసులు న్యాయంగా డ్యూటీ చేయాలి.. సభా ప్రాంగణానికి 15, 20 కిలోమీటర్ల దూరంలో ఆపేయడం కరెక్ట్ కాదు. 35 ఏళ్ల నా రాజకీయ జీవితంలో ఇలాంటివి ఎప్పుడూ చూడలేదు. కేసీఆర్ వెంటనే సభను సజావుగా సాగేందుకు పోలీసులకు సూచనలు చేయాలి. లేదంటే జరిగే పరిణామాలకు మీదే బాధ్యత. ఎక్కడ వాహనాలు ఆపితే అక్కడికి వేలాదిగా బైకులపై వెళ్తాం.. జనగర్జన జరిపి తీరుతాం.. ఏం జరిగినా మీదే బాధ్యత.. మేం ప్రజల పక్షాన పోరాడేందుకు సభలు, పోరాటాలు చేస్తుంటే ఇలా నిర్బంధ చర్యలు చేయడం తగదు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఇలాంటివి చూడలేదు.. స్వరాష్ట్రంలో ఈ నిర్బంధమేంటి? ముఖ్యమంత్రి ఆదేశాల మేరకే పోలీసులు ఇలా చేస్తున్నారు. ఏదైనా జరగరానిది జరిగితే మాకేం సంబంధం లేదు.. 9 ఏళ్లుగా కాంగ్రెస్ శ్రేణులను ఎన్నో ఇబ్బందులు పెట్టారు. అయినా న్యాయపరంగా పోరాడుతున్నామే గానీ, హద్దు మీరలేదు. కానీ, ఇప్పుడు లక్షలమంది సభకు వస్తుండడం చూసి ఓర్వలేక ఆంక్షలు విధిస్తారా? ముందే హెచ్చరిస్తున్నాం... ఏం జరిగినా మాకేం సంబంధం లేదు.. సభ తప్పకుండా జరుగుతుంది.. నన్ను అరెస్ట్ చేసినా సరే.. తెలంగాణ సమాజం అన్నీ గమనిస్తోంది.. వాహనాలు సీజ్ చేయడం, అక్రమ అరెస్టులు చేయడం ఏంటి? జరగరానిది ఏం జరిగినా ప్రభుత్వం, ముఖ్యమంత్రిదే బాధ్యత అని హెచ్చరిస్తున్నాం...

## ఏఐసీసీ అంటే.. ఆల్ ఇండియా కరప్షన్ కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

మరిచిపోలేదు. మా పార్టీ బీజేపీకి.. బీ టీమ్ కాదు.. కాంగ్రెస్ పార్టీకి.. సీ టీమ్ అంతకన్నా కాదు. బీజేపీ-కాంగ్రెస్ రెండింటినీ ఒంటిచేత్తో ఢీకొట్టే.. ఢీ టీమ్.. బీఆర్ఎస్‌ను నేరుగా ఢీకొనే దమ్ములేక బీజేపీ భుజంపై తుపాకీ పెట్టి మమ్మల్ని కాల్చే కుట్ర చేస్తారా? ఈ మిస్ ఫైరింగ్‌లో ముమ్మాటికీ కుప్పకూలేది.. కాంగ్రెస్సే. లక్ష కోట్లు వ్యయం కాని కాళేశ్వరం ప్రాజెక్టులో లక్షకోట్ల అవినీతా? అర్థంలేని ఆరోపణలు చేసి.. ప్రజాక్షేత్రంలో ఎన్నిసార్లు నవ్వులపాలవుతారు. తెలంగాణ ప్రజలు కోరుకొంటున్నది.. నిర్మాణాత్మక ప్రతిపక్షం. ప్రాజెక్టు నిర్మాణ వ్యయం కూడా తెలియని ప్రతిపక్షం కాదు. భూములు, భూరికార్డుల చుట్టూ అల్లుకున్న సవాలక్ష చికుముళ్లను విప్పిన ధరణిని ఎత్తివేసి.. మళ్లీ దళారుల రాజ్యం తెస్తామన్న రాహుల్ గాంధీని తెలంగాణ సమాజం ఎప్పటికీ క్షమించదు.. కర్ణాటకలో 'అన్నభాగ్య' హామీని గంగలో కలిపి.. ఇకడ 4 వేల పింఛన్ అంటే నమ్మేదెవరు? ఎన్నికల్లో హామీ ఇచ్చిన రేషన్ ఇవ్వలేనోళ్లు ఇకడికొచ్చి డిక్లరేషన్ అంటే విశ్వసించేదెవరు? కర్ణాటకలో బీజేపీని ఓడించింది అకడి ప్రజలు తప్ప ముమ్మాటికీ కాంగ్రెస్ కానే కాదు. మరో ప్రత్యామ్నాయం లేకే ఆ ఫలితం తప్ప.. అది మీ ఘనత కాదు. సమర్థత అంతకన్నా కాదు' అని మంత్రి కేటీఆర్ విరుచుకుపడ్డారు. సమ్మక జాతరను తలపించేలా పండుగలా సాగుతున్న పోడు భూముల పట్టాల పంపిణీ రాహుల్ గాంధీకి కనబడడం లేదా? అయితే.. కంటి వెలుగు కింద పరీక్షలు చేయించుకోవాలంటూ మంత్రి కేటీఆర్ చురకలంటించారు. 4.6 లక్షల ఎకరాల భూమికి పట్టాలు పంచి.. అడవిబిడ్డల జీవితాల్లో ఆనందాన్ని నింపిన మనసున్న ముఖ్యమంత్రి కేసిఆర్ అని పేర్కొన్నారు. నీళ్లు, నిధులు నియామకాలు అనే ఉద్యమ నినాదాలనే కాదు జల్ జంగల్ జమీన్ అనే మన్యంవీరుడు కుమ్రంభీం కలలను కూడా సంపూర్ణంగా సాకారం చేసిన దార్శనికుడు కేసీఆర్ అని కొనియాడారు. కాంగ్రెస్ పాలనలో 'మంచం పట్టిన మన్యం' వార్తలు వస్తే మా పాలనలో 'మన్యానికి మంచిరోజులు' అనే వార్తలు వచ్చాయని తెలిపారు.

## రైల్వే ప్లాట్‌ఫాంపై అప్రమత్తంగా ఉండాల

(మొదటి పేజీ తరువాయి)

రైల్వే స్టేషన్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సీసీ టీవీలో రికార్డు అయ్యాయి.ఓ విద్యార్థి రైల్వే ఫ్లాట్ ఫామ్ అంచున నిల్చొని చేతులు శుభ్రం చేసుకుంటున్నాడు. మయాంక్ అనే యువకుడు అక్కడికి వచ్చి తన స్నేహితుడి వద్ద వాటర్ బాటిల్ తీసుకొని మంచినీళ్లు తాగబోయాడు. అంతలోనే వెనుక నుంచి లోకల్ రైల్ అతి వేగంగా దూసుకు వచ్చి బలంగా మయాంక్‌కి ఢీ కొట్టింది. దాంతో అల్లంత దూరాన ఎగిరిపడి అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియో చూసిన ప్రతి ఒక్కరూ.. ప్లాట్‌ఫాంలపై జాగ్రత్తగా ఉండాలంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

# కేసీఆర్ రిమోట్ కంట్రోల్ మోదీ చేతుల్లో

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పెన్షన్‌ను రూ.4వేలకు పెంచుతామన్నారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, చేనేత కార్మికులు, ఒంటరి మహిళలు, కల్లుగీత కార్మికులు, ఎయిడ్స్ బాధితులు, డయాలసిస్ రోగులకు రూ.4వేల చొప్పున పెన్షన్ అందిస్తామని తెలిపారు. కొద్ది నెలల క్రితం కర్ణాటకలోనూ అవినీతి పార్టీ అధికారంలో ఉండేదని, బలహీన వర్గాలంతా ఏకమై ఆ పార్టీని ఓడించారని అన్నారు. తెలంగాణలోనూ అదేవిధంగా జరగబోతోందన్నారు. ఇక్కడ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబసభ్యులు, వారి ధనిక మిత్రులు ఓవైపు ఉంటే.. మరోవైపు రైతులు, దళితులు, మైనారిటీలు, ఆదివాసీలు, చిరు వ్యాపారులు ఉన్నారని తెలిపారు.

**బీజేపీ లేకుండా పోయింది..**

తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్య ముక్కోణపు పోటీ ఉంటుందని గతంలో చెప్పేవారని రాహుల్ అన్నారు. కానీ, హైవేలో వాహనం నడుస్తున్నప్పుడు అకస్మాత్తుగా ఒకేసారి నాలుగు టైర్లు పంక్చర్ అయినట్టుగా రాష్ట్రంలో బీజేపీ పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. తెలంగాణలో బీజేపీ లేకుండా పోయిందని, ఇప్పుడు పోటీ కాంగ్రెస్, బీజేపీ బీ టీమ్ మధ్యనే ఉంటుందని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో ఇటీవల జరిగిన ప్రతిపక్ష పార్టీల సమావేశానికి బీఆర్ఎస‌ను కూడా ఆహ్వానించాలని కొన్ని ప్రతిపక్షాలు సూచించాయని చెప్పారు. కానీ, బీజేపీకి బీ టీమ్‌గా ఉన్నవారితో తమకు ఎలాంటి ఒప్పందం ఉండబోదని తాము స్పష్టం చేశామన్నారు. వారు వస్తే తాము సమావేశంలో పాల్గొనలేమని చెప్పామన్నారు. ఇక గతంలో అనేకమంది కాంగ్రెస్‌ను వదిలి వెళ్లారని, బీజేపీ, బీఆర్ఎస్ ఆలోచన విధానాన్ని కలిగి ఉంటే అలాంటి వారితో తమకు సంబంధం లేదని అన్నారు. కానీ, కాంగ్రెస్ సిద్ధాంతం, ఆలోచనలకు మద్దతిచ్చేవారికి తమ తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయన్నారు. "ఖమ్మం జిల్లా కాంగ్రెసకు అడ్డా. ఇక్కడ మీరు బీఆర్ఎస‌ను సు నాయాసంగా ఓడించగలరు. కర్ణాటకలో ఓడించినట్టుగానే ఇక్కడా ఓడించాలి"అని రాహుల్ పిలుపునిచ్చారు.

**కండువా కప్పి పొంగులేటికి ఆహ్వానం**

ఖమ్మం జనగర్జన సభలో మాజీ ఎంపీ పొంగులేటి



శ్రీనివాసరెడ్డితో పాటు ఆయన అనుచరులను రాహుల్‌గాంధీ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వేదికపై సీనియర్ నేత మధుయాష్కి పేర్లు చదవగా.. రాహుల్ కండువా కప్పారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డితోపాటు భద్రాద్రి కొత్తగూడెం జడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మాజీ డీసీసీబీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, పిడమర్తి రవి, పొంగులేటి ప్రసాద్‌రెడ్డి, మద్దినేని బేబి స్వర్ణకుమారి, బానోతు విజయబాయి, తెల్లం వెంకట్రావు, ఊకంటి గోపాలరావు, కోటా రాంబాబు, జాడే ఆదినారాయణ, తుళ్లూరి బ్రహ్మయ్య, కోడూరి సుధాకర్, నిజామాబాద్ మాజీ ఎమ్మెల్సీ నర్సారెడ్డి, పద్మావతి రవి, ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ పాపిరెడ్డి, విశ్రాంత ఐఏఎస్ అధికారి బీవీ రాజు, మధిరకు చెందిన బొక్కలగడ్డ చంద్రశేఖర్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు.

**ప్రత్యేక ఆకర్షణగా 'ఓపెన్‌హార్ట్'లో పొంగులేటి మాటలు**

జనగర్జన సభలో ఏర్పాటు చేసిన భారీ ఎల్ఈడీ స్క్రీన్లపై రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డితో పాటు.. పొంగులేటి శ్రీనివాసరెడ్డికి సంబంధించిన ఏవీలను ప్రదర్శించారు. పొంగులేటి ఏవీ ప్రదర్శించే సమయంలో అత్యధికసార్లు 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి'లో ఎండీ వేమూరి రాధాకృష్ణ నిర్వహించిన 'ఓపెన్‌హార్ట్ విత్ ఆర్కే'లో అడిగిన ప్రశ్నలకు పొంగులేటి చెప్పిన సమాధానాల క్లిప్‌లను పొందుపరిచారు. ఈ క్లిప్‌లు వచ్చిన సమయంలో సభకు హాజరైన కార్యకర్తలు, పొంగులేటి అభిమానులు ఈలలు వేసి సందడి చేశారు.

**ఖమ్మం కాంగ్రెస్ ఖిల్లా: ఉత్తమ్**

ఖమ్మం జిల్లా కాంగ్రెస్ ఖిల్లా అని, గర్జన సభ పార్టీ శ్రేణుల్లో ఎంతో జోష్ నింపిందని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడం తథ్యమని ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఖమ్మం డిక్లరేషన్‌లో అన్నిరకాల పింఛన్లను రూ.4వేలు చెల్లిస్తామని ప్రకటించిన రాహుల్‌గాంధీకి ధన్యవాదాలు తెలిపారు. మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ.. దోపిడీ, మోసపు మాటలతో ప్రజలను దగా చేస్తున్న కేసీఆర్ అరాచక పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు.

### అనువాదంలో ఉత్తమ్ తడబాటు

రాహుల్‌గాంధీ ప్రసంగాన్ని తెలుగులోకి అనువాదం చేసిన ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. ఈ విషయంలో కొంత తడబా టుకు గురయ్యారు. రాహుల్ చెప్పిన విషయాలను యథాత థంగా అనువదించడంలోనూ, ప్రజలను ఆకట్టుకునేలా వివరించడంలోనూ ఉత్తమ్ కొంత విఫలమయ్యారన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కొన్నిసార్లు రాహుల్ మాటలు ఉత్తమ్‌కు సరిగా వినిపించకపోవడంతో ఆయనను మళ్లీ అడిగారు. దీంతో రాహుల్ తిరిగి చెప్పాల్సివచ్చింది. మిషన్ కాకతీయ పథకంలో అవినీతి జరిగిందని రాహుల్ అంటే.. మిషన్ భగీరథలో అవినీతి జరిగిందని ఉత్తమ్ అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పోడు భూములన్నీ గిరిజనులకు అప్పగిస్తామని రాహుల్ హామీ ఇవ్వగా.. పోడు భూములన్నీ ఇప్పటికే ఇచ్చేశామని ఉత్తమ్ చెప్పారు. ఇక కర్ణాటకలో పేదల వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు కాంగ్రెస్ పార్టీ చేసిన పోరాటంలో నిరుపేదలందరూ తమకు అండగా నిలిచారని రాహుల్ చెప్పగా.. ఉత్తమ్ 'నిరుపేదలు' అని కాకుండా ప్రతి కుటుంబం కాంగ్రెసకు అండగా నిలిచిందన్నారు. తన భారత్ జోడో యాత్రకు తెలంగాణ ప్రజలు మద్దతు పలికి అండగా నిలిచారని రాహుల్ ఒకటికి రెండు సార్లు గుర్తుచేసి.. ఇందుకు కృతజ్ఞతలు తెలుపగా.. అనువా దంలో ఉత్తమ్ 'యాత్ర' ప్రస్తావనే చేయలేదు. ఇక కాంగ్రెస్ పార్టీ ఇంతకుముందు, రైతు డిక్లరేషన్, యూత్ డిక్లరేషన్ చేసిందని, ఇప్పుడు మరో గొప్ప డిక్లరేషన్ చేయబోతున్నామని రాహుల్ చెప్పగా.. 'కాంగ్రెస్ గొప్ప డిక్లరేషన్ చేసింది' అని ఉత్తమ్ అన్నారు.

# వారం పాటు 58 రైళ్లు రద్దు

### తెలుగు రాష్ట్రాల్లో 50పైగా సర్వీసులు 7 రోజులు బంద్

**హైదరాబాద్, జూలై 2, (వాయిస్ టుడే):** సాంకేతిక అంశాలు, నిర్వహణ పనుల నేపథ్యంలో వారం రోజుల పాటు భారీగా రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఆదివారం ప్రకటించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాలకు సర్వీసులందించే పలు



రైళ్లను ఈ నెల 9 వరకు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. 50పైగా సర్వీసులను వారం రోజుల పాటు, 8 రైళ్లను పాక్షికంగా రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఐదు రైళ్ల సమయాల్లో తాత్కాలికంగా మార్పు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఓ ప్రకటనలో వెల్లడించారు. హైదరాబాద్‌లో నాంపల్లి, ఫలక్‌నుమా, లింగంపల్లి మధ్య తిరిగే 22 ఎంఎంటీఎస్‌లను 9వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్, సికింద్రాబాద్‌తో పాటు విజయవాడ, గుంటూరు డివిజన్లలో నిర్వహణ పనుల రీత్యా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. కాగా, రద్దు చేసిన, పాక్షికంగా రద్దు చేసిన సర్వీసుల్లో ఒకటీ రెండు మినహా అన్నీ ప్యాసింజర్ రైళ్లే ఉన్నాయి.

## కాంగ్రెస్ కాదు.. స్కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)

మీ కండ్లకు కనిపించలేదా? మేం పట్టాలు పంచినంక మళ్లీ మీరిచ్చేదేంది? అప్‌డేట్ తెలుసుకోని ఔట్‌డేటెడ్ పొలిటీషియన్ రాహుల్‌గాంధీ' అని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం ఖర్చు మొత్తం రూ. 80,321.57 కోట్లయితే, అవినీతి లక్ష కోట్లని అనడం పెద్ద జోక్ అని పేర్కొన్నారు. 'కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం ఖర్చు రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తున్నది. కేంద్ర ప్రభుత్వం ఒక రూపాయి కూడా ఇవ్వలేదని మీ పార్టీ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్రం సమాధానం ఇచ్చిన విషయం మీకు తెలియదా? అని రాహుల్‌గాంధీని ప్రశ్నించారు. స్కీంలు.. స్కాంలలో ఆరితేరిన కాంగ్రెస్.. కుంభకోణాల గురించి మాట్లాడడం అంటే దయ్యాలు వేదాలు వల్లించడమేనని దుయ్యబట్టారు. 'అప్పుడే ముదిగొండ కాల్పులు మరిచిపోయారా? భూములు అడిగితే జైల్లో వేసినవాళ్లు.. కరెంట్ అడిగితే పిట్టల్లా కాల్చి చంపినోళ్లు ఖమ్మంలో కల్లబొల్లి కబుర్లు చెప్తే నమ్మే వాళ్లు ఎవరూ లేరు. ఖమ్మం సభ ఒక ముకలో చెప్పాలంటే.. పసలేని ఆరోపణలు.. ఊకదంపుడు ప్రసంగాలు.. రాసిచ్చిన స్క్రిప్ట్‌తో రాహుల్ సిట్' అని హరీశ్‌రావు నిప్పులుచెరిగారు.

# కాళేశ్వరం నుంచి నీటిని ఎత్తిపోయండి

**హైదరాబాద్, జూలై 2, (వాయిస్ టుడే):** వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో దేశమంతా కరువు పరిస్థితులు నెలకొన్నాయని, తెలంగాణలో అటువంటి పరిస్థితి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశించారు. కాళేశ్వరం సహా, గోదావరి, కృష్ణా నదుల మీద ఉన్న ప్రాజెక్టుల నుంచి నీటిని ఎప్పటికప్పుడు ఎత్తిపోస్తూ, రిజర్వాయర్లలో సరిపడా నీరు ఉండేలా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో తాగు, సాగునీటికి సమస్య రాకుండా చేపట్టాల్సిన చర్యలపై మంత్రులు, అధికారులతో సీఎం కేసీఆర్ సచివాలయంలో ఆదివారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

రాష్ట్రంలో ఇప్పటివరకు నమోదైన వర్షపాతం, ప్రాణహిత తదితర నదుల్లో నీటి లభ్యత, రిజర్వాయర్లలోని నీటి నిల్వలు, ప్రస్తుత విద్యుత్తు డిమాండ్ తదితర అంశాలపై చర్చించారు. చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. తాగు, సాగునీటికి లోటు రాకుండా చూడాలని ఆదేశించారు. నీటిపారుదల, విద్యుత్తు శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రతి చుక నీటిని ఒడిసిపట్టి ప్రజలకు అందించాలని సూచించారు. ప్రాణహిత ప్రవాహం నుంచి నీటిని ఎప్పకప్పుడు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టుల ద్వారా ఎత్తిపోస్తూ మిడ్‌మానేర్‌ను నింపాలని, అకడి నుంచి లోయర్‌మానేర్ డ్యాంకు సగం, పునరుజ్జీవ వరద కాలువ ద్వారా ఎస్సారెస్పీకి సగం నీళ్లను తరలించాలని తెలిపారు. తద్వారా అటు కాళేశ్వరం చివరి ఆయకట్టు సూర్యాపేట దాకా, ఇటు ఎస్సారెస్పీ ఆయకట్టుకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**ఇది పరీక్ష కాలం**

'కాళేశ్వరం విలువ కష్టకాలంలోనే తెలుస్తుంది. ప్రాజెక్టు నిర్మాణానికి ఎంతగా కష్టపడ్డారో అదే స్థాయిలో ప్రాణహిత, గోదావరి ద్వారా వచ్చిన నీటిని వచ్చినట్టు ఎత్తిపోస్తూ రాష్ట్రంలో తాగు, సాగునీటికి ఎటువంటి సమస్య రాకుండా చూసుకోవాల్సిన గురుతర బాధ్యత ఇరిగేషన్, విద్యుత్తు, వ్యవసాయశాఖ అధికారుల మీద ఉన్నది. ఇన్ని రోజులు ఒక ఎత్తు. ఇప్పుడు ఒక ఎత్తు. ఇది ఇరిగేషన్ శాఖకు పరీక్ష కాలం. ఇది మునుపటి తెలంగాణ కాదు. గతంలోలాగా ఆలోచిస్తే కుదరదు. నీటిసమస్య లేకుండా ప్రాజెక్టులు కట్టుకున్నాం. తాగు, సాగు అవసరాలకు సమృద్ధిగా నీరు



అందుతున్నది. ఇట్లాంటి సందర్భాలు వచ్చినప్పుడే మన సామర్థ్యాన్ని నిరూపించుకోవాల్సి ఉంటది. సంక్షోభ సమయంలోనే మనం పంటలు పండించి చూపించాలి. అప్పుడే మనం సిపాయిలం అవుతాం' అని సీఎం కేసీఆర్ స్పష్టంచేశారు. అన్ని వ్యవస్థలను సమన్వయం చేసుకుంటూ, ఎవరి పని వారు సమర్థంగా నిర్వహిస్తూ, మిమ్మల్ని మీరు నిరూపించుకోవాలని అధికారులకు సూచించారు. ఈ ఒక సంవత్సరం అనుభవం భవిష్యత్తు తెలంగాణ చరిత్రలో ఉపయోగపడుతుందని చెప్పారు.. ఎకడి ఈఎన్సీలు అకడే ఉండి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని, ప్రజలకు నీరందించడమే లక్ష్యంగా ఏకాగ్రతతో పనిచేయాలని ఆదేశించారు. ఇందుకోసం అందరం కలిసి ప్రతిజ్ఞ తీసుకోవాలని అన్నారు. తాగునీటి అవసరాల కోసం రిజర్వాయర్లలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు చెక్ చేసుకుంటూ సమస్య రాకుండా చూసుకోవాలని మిషన్ భగీరథ ఈఎన్సీని ఆదేశించారు. ఉదయసముద్రం, కోయిల్‌సాగర్ రిజర్వాయర్లలో కొంత నీటి ఎద్దడి ఉన్నదని, వాటిలో నీటి నిల్వలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

**రైతులు అధికారుల సూచనలు పాటించాలి**

కష్టకాలంలో నీటిని వినియోగించుకోవడంలో రాష్ట్ర ప్రజలు, రైతాంగం జాగ్రత్తలు వహించాలని, నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని సీఎం కేసీఆర్ సూచించారు. వ్యవసాయ, నీటిపారుదల శాఖల ఇంజినీర్ల సూచనలు, సలహాలు పాటిస్తూ పంటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్ని కష్టాలు వచ్చినా రాష్ట్ర రైతాంగాన్ని, వ్యవసాయాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా నిర్ణయాలు తీసుకుంటామని ప్రకటించారు. వర్షాభావ ప్రాంతాల్లో ఇప్పటికే విత్తిన పత్తి వంటి విత్తనాలు మొలకలెత్తలేదని, ఈ నేపథ్యంలో రైతులు తిరిగి విత్తుకొనేందుకు విత్తనాలు, ఎరువులు అందించగలిగేలా కంటిన్జెన్సీ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. దీనిపై రోజూ మినిట్ టు మినిట్ రిపోర్టును సీఎం కార్యాలయానికి అందజేయాలని ఆదేశించారు. ఇరిగేషన్, వ్యవసాయ, విద్యుత్తు, పంచాయతీరాజ్ శాఖల నుంచి వచ్చే రిపోర్టులను అనుసరించి సీఎం కార్యాలయం సంబంధిత మంత్రులు, ప్రజాప్రతినిధులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తుందని సీఎం వెల్లడించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, జగదీశ్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బాల సుమన్, జాజుల సురేందర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**వర్షాభావం ఉన్నా రైతులకు పుష్కలంగా నీరు**

రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా రైతులకు ఇబ్బంది కలగకుండా వానకాలం సాగుకు నీటిని అందించేందుకు చర్యలు చేపడుతున్నామని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. సీఎం సమీక్ష అనంతరం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇరిగేషన్‌శాఖ అధికారులతో మంత్రి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఎల్ఎండీ ఎగువ భాగం ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు 50 టీఎంసీలు అవసరమని, ఎస్సారెస్పీలో ప్రస్తుతం 20 టీఎంసీల నీరు ఉన్నదని చెప్పారు. ఎస్సారెస్పీ పునరుజ్జీవంలో భాగంగా కాళేశ్వరం జలాలు రోజుకు 0.5 టీఎంసీ చొప్పున 60 రోజుల్లో 30 టీఎంసీలు ఎత్తిపోసి ఎస్సారె-స్పీని నింపాలని సీఎం నిర్ణయించినట్టు తెలిపారు. నీటిని ఎత్తిపోసేందుకు మూడు పంపుహౌజ్‌లు సిద్ధం చేయాలని సీఈ సుధాకర్‌రెడ్డిని మంత్రి ఆదేశించారు. నిజాంసాగర్‌లో 5 సీఎంసీల నీటి నిల్వలుండగా, వానకాలం సాగు కోసం నీటిని విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేయాలని కామారెడ్డి సీఈ శ్రీనివాస్‌రెడ్డికి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టుల పంపింగ్ నిర్వహణను ప్రైవేట్ కాంట్రాక్టర్లకు కాకుండా, ప్రభుత్వరంగ సంస్థ అయిన జెన్‌కోకు ఇచ్చేలా విధివిధానాలు ఖరారు చేయాలని సాగునీటి శాఖ అధికా రులను సీఎం కేసీఆర్ ఆదేశించారు. పాలేరు రిజర్వాయర్‌కు నాగార్జునసాగర్ నుంచి నీరు వచ్చే అవకాశాలు ప్రస్తుతం లేనందున, బయ్యన్నవాగు నుంచి నీటిని సందర్భానుసారం పాలేరుకు వదిలేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

# ఆ స్థలాలకు మీరే యజమానులు: హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్

### సంపూర్ణ న్యాయ సహకారం అందిస్తాం: సీనియర్ అడ్వకేట్? రామచందర్ రావు

### కోర్టు ధిక్కరణ పిటిషన్ వేస్తాం: వ్యవస్థాపక సభ్యుడు పీ వీ రమణారావు




సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం నిజాంపేట్, పేట్ బషీరాబాద్ లోని 70 ఎకరాలు జేఎన్‌జె సొసైటీకే చెందుతుందని, ఈ భూమి కోసం సభ్యులందరూ డబ్బులు చెల్లించినందున ఆ భూమికి జేఎన్‌జే సొసైటీ సభ్యులే యజమానులని హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్? స్పష్టం చేశారు. ఆదివారం టీమ్ జేఎన్‌జే ఆధ్వర్యంలో జరిగిన జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్టుల మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సభ్యుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఆదివారం ఉదయం పది గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఫౌండర్ మెంబర్శ్రీ పీవీ రమణారావు అధ్యక్షతన జేఎన్‌జే సొసైటీ సభ్యుల కీలక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథులుగా హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్, మాజీ ఎమ్మెల్సీ – సుప్రీంకోర్టు సీనియర్ అడ్వకేట్ ఎన్ రామ చంద్రరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పు ?ప్రకారం జేఎన్‌జే సొసైటీ సభ్యులకు మాత్రమే ఈ స్థలాలు చెందుతాయని, ఇందులో మధ్యవర్తిత్వం అవసరమే లేదని స్పష్టంగా పేర్కొంది. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పూర్తి స్థాయిలో అధ్యయనం చేసినట్లయితే ఈ స్థలాలు జేఎన్‌జే సొసైటీకి అప్పగించాల్సిందేనని ఖరాకండిగా చెప్పారు. ప్రభుత్వం నిర్ణయించిన అప్పటి మార్కెట్ ధర ప్రకారంగా రూ.12.33 కోట్లు చెల్లించి సొసైటీ సభ్యులు కొనుగోలు చేయడం, దానిపైనే సుప్రీం తుదితీర్పు అనే ఆయుధాలతో భూమిని ఎలాగైనా స్వాధీనం చేసుకునే హక్కు కలిగించిందని జస్టిస్ చంద్రకుమార్ వివరించారు. ఒకవేళ ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయని పక్షంలో.. ఈ అంశంపై సుప్రీంకోర్టు తలుపు తట్ట వచ్చని ఆయన స్పష్టం చేశారు. జేఎన్‌జే సొసైటీకి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చాలా సుస్పష్టంగా ఉందని, ఈ స్థలాల్లో మూడోపార్టీ జోక్యం లేదని తీర్పులో స్పష్టంగా ఉందని చెప్పారు. సభ్యులు ఈ స్థలాలను డబ్బులు పెట్టి కొన్నందున ఈ స్థలాలపై సర్వ హక్కులు వారికే చెందుతాయన్నారు. ప్రభుత్వ వర్గాలు ఈ స్థలాలను అప్పగించని సందర్భంలో ప్రజాస్వామ్య యుతంగా నిరహారదీక్షలు చేయాలని సూచించారు. ఆ దీక్షల్లో తానూ కూడా పాల్గొంటానని చెప్పారు. సభ్యులు న్యాయపరమైన అంశాలపై అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. జర్నలిస్టులు సమాజంలో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు అడ్వకేట్ రామచంద్ర రావు మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్థలాలను జేఎన్‌జే హౌసింగ్ సొసైటీకి అప్పగించాలని అన్నారు. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం అప్పగించని సందర్భంలో సొసైటీ సభ్యులకు కోర్టుల్లో న్యాయ సాయంతోపాటు అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తామని హామీ ఇచ్చారు. సభ్యులు రూ.2 లక్షల చొప్పున రూ.12.33 కోట్లు ప్రభుత్వానికి చెల్లించినందున 70 ఎకరాల స్థలం జర్నలిస్టులకే చెందుతుందని అన్నారు. అందరి సమస్యలను ప్రజా బాహుళ్యంలోకి తెచ్చే జర్నలిస్టులకు దేశ అత్యున్నత న్యాయస్థానం వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. సుప్రీం తీర్పు ప్రకారం పేట్ బషీరాబాద్ లోని 38 ఎకరాల స్థలాన్ని వెంటనే సొసైటీకి స్వాధీనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన జేఎన్‌జే సొసైటీ వ్యవస్థాపక సభ్యుడు పీ వీ రమణారావు మాట్లాడుతూ.. స్థలాల సాధనకు న్యాయ పరమైన చర్యలు తీసుకుంటున్నామని, కోర్టు ధిక్కరణ పిటిషన్ వేస్తామని తెలిపారు. అలాగే నిరసనలు, రౌండ్ టేబుల్ సమావేశాలు, రిలే నిరాహార దీక్షల ద్వారా ఆందోళన ఉధృతం చేస్తామని తెలిపారు. సమావేశంలో తొలుత మరణించిన సభ్యులకు నివాళులర్పించారు. వారి ఆశయ సాధనకు కృషి చేస్తామని సభ్యులంతా ప్రతిజ్ఞ చేశారు. సభలో సభ్యులు 'సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం తమ సొసైటీకి పేట్ బషీరాబాద్‌లోని 38 ఎకరాల స్థలం ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేయాలని, సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయకపోవడం వల్? సుప్రీంకోర్టులో పిటిషన్ వేయాలని ఏకగ్రీవంగా తీర్మానాలు ఆమోదించారు. ఇంకా రౌండ్ టేబుల్ సమావేశాలు, రిలే నిరాహార దీక్షలు చేపట్టాలన్న తీర్మానాలకు ఆమోదం తెలిపారు. సభకు దాదాపు 500 మంది సభ్యులు హాజరై స్థలాలను సాధించుకోవడానికి చేపట్టాల్సిన ఆందోళనపై తమ విలువైన సూచనలు చేశారు. సభలో సభ్యులు బోడపాటి శ్రీనివాస్, షరీఫ్, అశోక్ రెడ్డి, రమేశ్ బాబు, నర్సింగ్, తాతా శ్రీనివాస్, అంజూమ్ మాట్లాడారు. భూషణ్ వందన సమర్పణ చేశారు. ఈ సమావేశం అనంతరం జేఎన్‌జే సొసైటీ సభ్యులు సుందరయ్య పార్కు చుట్టూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సుప్రీంకోర్టు తీర్పును వెంటనే అమలు చేయాలని, తమ భూమిని తమకే అప్పగించాలనే నినాదాలతో సభ్యులు హోరెత్తించారు.



## సామాన్య ప్రజలపై భారం మోపుతున్న రాష్ట్ర ప్రభుత్వం

### పెంచిన కూరగాయల ధరలు వెంటనే తగ్గించాలి: కాట సుధా శ్రీనివాస్ గౌడ్

పటాన్ చెరు: రాష్ట్ర ప్రభుత్వం సామాన్య ప్రజలపై భారం మోపుతున్నాయని సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు ఆదేశాల మేరకు పెరిగిన కూరగాయల ధరలను వ్యతిరేకిస్తూ పటాన్ చెరు పట్టణంలోని బండ్లగూడ గ్రామంలో మాజీ సర్పంచ్ జయమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాట్లాడుతూ ఇష్టానుసారంగా పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కూరగాయల ధరలను పెంచుతూ ప్రజలను మరింత కష్టపెడుతున్నారని మండి పడ్డారు. పెంచిన ధరలకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని అన్నారు.

## కుమ్మరుల సంక్షేమానికి పెద్దపీట

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



పటాన్ చెరు: సీఎం కేసీఆర్ నాయకత్వంలో కులవృత్తుల ఆర్థిక అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్చెరు మండలం పాశమైలారం గ్రామంలో ఏర్పాటు చేసిన కుమ్మరుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉనికి కోల్పోతున్న కులవృత్తులకు జీవం పోసిన మహోన్నత నాయకుడు సీఎం కేసీఆర్ అన్నారు. కులవృత్తుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఇటీవల బీసీ బందు పథకాన్ని ప్రవేశపెట్టిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పటాన్చెరు నియోజకవర్గంలో కుల వృత్తుల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్నామని తెలిపారు. సొంత నిధులతో వివిధ కులాలకు ఆత్మగౌరవ భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు. వచ్చే నెలలో కుమ్మరుల కోసం 500 గజాల స్థలంలో మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలోనూ తగు ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. సబ్బండ వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న సీఎం కేసీఆర్ ను ప్రతి ఒక్కరు నిండు మనస్సుతో ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, గ్రామ సర్పంచ్ కృష్ణ యాదవ్, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, కుమ్మరి సంఘం ప్రతినిధులు మల్లేష్, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, గ్రామ ప్రజా ప్రతినిధులు, కుమ్మరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## మధుర చారిటబుల్ ట్రస్ట్, కిమ్స్ హాస్పిటల్, సాధురం కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం

ఉప్పల్, జూలై 2 జూలై 2 (వాయిస్ టుడే ప్రతినిధి):- మధుర చారిటబుల్ ట్రస్ట్, కిమ్స్ హాస్పిటల్,సాధురం కంటి ఆసుపత్రి వారిసౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ఉచిత వైద్య శిబిరాన్ని మధుర చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ రాగిడి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరం ఆక్స్ఫర్డ్ హైస్కూల్ , ఆఫీసర్స్ కాలనీ చెర్లపల్లి లో నిర్వహించారు.భారీ ఎత్తున ఈ హెల్త్ క్యాంపులో చర్లపల్లి డివిజన్ వాసులు పాల్గొన్నారు.గత 25 సంవత్సరాలుగా మధుర చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉప్పల్ నియోజకవర్గం లో అనేక రకాల ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్న రాగిడి లక్ష్మా రెడ్డి పేర్కొన్నారు.ఈ మెగా క్యాంప్ లో జనరల్ మెడిసిన్, కార్డియాలజీ, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్స్, గైనకాలజీ, ఆప్తమాలజీ,విభాగాలకు చెందిన వైద్యులు పాల్గొన్నారు.మధుర చారిటబుల్ ట్రస్ట్ వారు సొంత ఖర్చుతో ఉచితంగా ఉప్పల్ నియోజకవర్గం ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి,కళ్లద్దాలు, అవసరమైన వారికి శస్త్రచికిత్సలు, మహిళలకు గైనకాలజీ సంబంధించిన పరీక్షలు, ఆపరేషన్లు, గుండెకు సంబంధించిన కార్డియాలజీ పరీక్షలు,వృద్ధులకు ఆర్థోపెడిక్ సంబంధించిన పరీక్షలు, చిన్నపిల్లలకు పీడియాట్రిక్స్ పరిక్షలు, అన్ని రకాల వారికి ఉచితంగా మందులను అందజేస్తున్నట్లు మధుర చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ రాగిడి లక్ష్మా రెడ్డి వివరించారు. కిమ్స్,సన్ షైన్ హాస్పిటల్స్ అనుభవజ్ఞులైన 30 మంది డాక్టర్లచే అధునాతన వైద్య పరికరాలతో వైద్య పరీక్షలు, పేదలకు శాస్త్ర చికిత్సలు చేయిస్తూ,వేలాది మందికి వైద్య సేవలుఅందించిన ఘనత మధుర చారిటబుల్ ట్రస్ట్ దే అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ కార్పొరేటర్, డివిజన్ అధ్యక్షులు గడ్డం యాదగిరి, చర్లపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్ యాదవ్ చర్లపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ వెంకట్ గౌడ్, చర్లపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ ముస్తాక్ అహ్మద్, దర్శనం లక్ష్మయ్య,కాప్రా ఎస్టీ సెల్ అధ్యక్షులు సురేష్ నాయక్, చందు యాదవ్ మల్లేష్ యాదవ్, శ్రావణ్ కుమార్,సన్నీ గౌడ్ పవన్ పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రికి స్వాగతం పలికిన బిజెపి నాయకులు



వరంగల్: ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వరంగల్ పార్లమెంట్ పర్యటన సందర్భంగా ఉమ్మడి జిల్లాల సన్నాహక సమావేశనికి విచ్చేసిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని వరంగల్ NITలో మర్యాద పూర్వకంగా కలిసి స్వాగతం పలికిన బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు మరియు బిజెపి కార్యకర్తలు.



## ప్రజాకలాల, గళాల గర్జన పోస్టర్ ఆవిష్కరణ

కూకట్ పల్లి,జూలై 02 (వాయిస్ టుడే) ప్రజా కళాకారులతో సహా 152 మంది పై తెలంగాణ ప్రభుత్వము మోపిన తాడ్వాయి కుట్ర కేసును బేశరుతుగా ఎత్తివేయాలని, ఊపా చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య (ఎసిఎఫ్) ఆద్వర్యం లో జూలై 15 న హైదరాబద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే సభ పోస్టర్ ను సుందరయ్య విజ్ఞాన కేంద్రం టిపిఎస్కె లో ఆవిష్కరించారు. ఈ సంధర్భంగా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు విమలక్క మాట్లాడుతూ.. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమం లో 30 సాంస్కృతిక సంఘాలు పాల్గొంటున్నాయి. ప్రశ్నించే గొంతుల పై అక్రమ కేసులు మోపడాన్ని వ్యతిరేకించే అందరు పాల్గొనాలి అని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో, భూపతి వెంకటేశ్వర్లు, ఉమా మహేష్, మల్సూర్, మోహన్ బైరాగి, రమేశ్ రాకేష్, డా: యాదగిరి, రామన్న,విశాల, సంధ్య, అరుంధతి,యాదగిరి పాల్గొన్నారు.



## గొట్టుముక్కుల ప్రేమసరోవర్ ఎమరాల్డ్ అపార్ట్మెంట్ నూతన కమిటీ ఎన్నిక

కూకట్పల్లి : 02(వాయిస్ టుడే) కూకట్ పల్లి సర్కిల్ పరిధిలోని గొట్టుముక్కుల ప్రేమసరోవర్ ఎమరాల్డ్ అపార్ట్మెంట్ ఆదివారం నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుదర్శన్, ఉపాధ్యక్షుడిగా జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా ధర్మరాజు, జాయింట్ సెక్రెటరీ రవిశంకర్, కోశాధికారిగా భాస్కరరావు తో పాటు 40 మంది సభ్యులతో కూడిన నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఈ కమిటీ రెండు సంవత్సరాలు ఉంటుంది.



## ప్రణాళిక బద్ధంగా కాలనీల అభివృద్ధి

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్ చెరు: జిహెచ్ఎంసి పరిధిలోని డివిజన్లలో నూతనంగా ఏర్పడుతున్న కలనులని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకొని వెళుతున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని సింఫనీ కాలనీ లో 42 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో కాలుష్యానికి చిరునామాగా ఉండే ఈ ప్రాంతం నేడు గేటెడ్ కమ్యూనిటీలకు నివాసంగా అభివృద్ధి చెందిన సంతోషకరమన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించాలన్న సమున్నత లక్ష్యంతో పని చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ఆల్విన్ కాలనీ నుండి సింఫనీ కాలనీ వరకు మూడు కోట్ల రూపాయలతో సీసీ రోడ్డు పనులు పూర్తి చేశామని, అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని గ్రీన్ మెడోస్ మీదుగా సింఫనీ వరకు మరో సిసి రోడ్డు నిర్మాణం అందుబాటులోకి తీసుకొని వచ్చామని తెలిపారు. వీటి మూలంగా పది కాలనీల ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేవాలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం



పటాన్ చెరుద(వాయిస్ టుడే న్యూస్) రామచంద్రాపురం ఎల్ఐజీలో శ్రీ మహాగణపతి చంద్రమౌళీశ్వర, రాజరాజేశ్వరి, దత్తాత్రేయ సహిత, శ్రీ కార్యసిద్ధి పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానం అభివృద్ధికి 8 లక్షలు ఇస్తానని నీలం మధు ముదిరాజ్ హామీ ఇచ్చి ఈరోజు రూ.3 లక్షల అందించారు. మిగతా ఐదు లక్షలు త్వరలో ఇస్తానని చెప్పారు. దేవాలయంలో శ్రీశ్రీశ్రీ దత్త విజయానంద స్వామివారి 20వ చాతుర్మాస వ్రత దీక్షా మహోత్సవం సందర్భంగా శ్రీ దత్తవిజయానంద తీర్థ స్వామి జీ అని మార్చు ప్రారంభించిన షెడ్డు కార్యక్రమంలో నీలం మధు ముదిరాజ్ కూడా పాల్గొన్నారు. అనంతరం దేవాలయంలో స్వామివారికి నీలం మధు ముదిరాజ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. అందరికీ అందుబాటులో ఉండి అన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటానని ఆయన తెలిపారు అందరూ ఆదరిస్తే మరింత చురుకుగా పని చేస్తానని ఆయన చెప్పారు. మీరు చూపించే ప్రోత్సాహమే నాకు కొండంత అండగా నిలుస్తుందని అన్నారు మీ అభిమానానికి ఎల్లప్పుడూ విశ్వాసపాత్రుడిగా ఉంటానని తెలిపారు,ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చంద్రమౌళీశ్వర్ రెడ్డి, మేనేజింగ్ చైర్మన్ శ్రీనివాస్ రాజ్, కమిటిసభ్యులు బాలసుబ్బా రెడ్డి, వేంకటేశ్వర్ రెడ్డి, సోమయ్య, సత్యానారాయణ,భక్తులు, ఎన్ ఎం ఆర్ యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## మళ్లీ ముఖ్యమంత్రిగా కేసీఆర్ సార్ రావాలి

### బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు: గోల్కొండలో అంగరంగవైభవంగా నిర్వహించిన జగదాంబ మహంకాళీ బోనాల జాతర కార్యక్రమంలో భాగంగా తొట్టెల కార్యక్రమంలో నీలం మధు ముదిరాజ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వం మరెన్నో సంక్షేమ పథకాలు తీసుకువచ్చి అభివృద్ధిలోకి వచ్చేలా కృషిచేసేలా చూడాలని అమ్మవారిని కోరినట్లు ఆయన తెలిపారు. బోనాలు, జాతర మహోత్సవాలతో రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని తెలిపారు. ప్రజలు ఇంత ఆనందంగా ఉండేందుకు కారణం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలే అని అన్నారు, ఈకార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, యువకులు, %చీవీ=% యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వాయిస్ టుడే
జనగాత్రం - మననేత్రం
హైదరాబాద్
సోమవారం 3 జూలై 2023



## కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయని కెసిఆర్ ప్రభుత్వం పూర్తిగా వైపల్యం..!

గోదావరిఖని(వాయిస్ టుడే) IFTU పెద్దపెల్లి జిల్లా కమిటీ సమావేశం గోదావరిఖనిలో జరిగింది. ఈ సమావేశానికి IFTU తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సూర్యం హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం కాంట్రాక్టర్ కార్మికులను ఆదుకోవడంలో పూర్తిగా వైఫల్యం చెందింది. కనీస వేతనాలకు సంబంధించిన గెజిట్ ను విడుదల చేయడంలో పూర్తిగా అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నది. కార్పొరేట్ బహుళ జాతి సంస్థల చేతుల్లో కేసీఆర్ ప్రభుత్వం బందీ అయి ఉన్నది. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలను నిర్ణయించడంలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నది. NTPC కాంట్రాక్టు కార్మికులు నెలల తరబడి ఆందోళన చేస్తున్నప్పటికీ లేబర్ డిపార్ట్మెంట్ అధికారులు గానీ స్థానిక ప్రజాప్రతినిధులు గాని కాంట్రాక్ట్ కార్మికుల విషయంలో జోక్యం చేసుకున్న పరిస్థితి లేదు. రాష్ట్రంలో కాంట్రాక్టు కార్మికులను రెండవ తరగతి పౌరులుగా చూస్తున్న దుస్థితి ఉన్నది. తెలంగాణ కోసం ఉద్యమించిన కాంట్రాక్టు కార్మికులకు సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో నిరాశే ఎదురవుతున్నది. ఈ స్థితిలో కాంట్రాక్ట్ కార్మికులంతా మరోసారి సమస్యల పోరాటానికి సిద్ధం కావాలని కామ్రేడ్ కే సూర్యం పిలుపునిచ్చారు. నాయకులు తోకల రమేష్ గుజ్జుల సత్యనారాయణరెడ్డి, జిందం రామ్ ప్రసాద్, ఆడేపు శంకర్, గుమ్మడి వెంకన్న, తూళ్ళ శంకర్, మార్త రాములు, ఇనుగాల రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



## బీఎస్పీ పార్టీలో 25 మది యువకుల చేరిక!

గోదావరిఖని.(వాయిస్ టుడే న్యూస్) బీఎస్పీ పార్టీ లో చేరిన ఇందిరా నగర్ యూత్ సభ్యులు. ఆదివారం స్థానిక ఇందిరా నగర్ లో అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ లో బీఎస్పీ సీనియర్ నాయకులు దేవునూరి సంపత్ కుమార్ ఆధ్వర్యంలో 25 మంది ఇందిరా నగర్ యూత్ సభ్యులు బీఎస్పీ పార్టీ లో చేరడం జరిగింది. ఈ కార్యక్రమానికి బీఎస్పీ పార్టీ రామగుండం నియోజకవర్గ ఇంచార్జ్ గోలివాడ ప్రసన్న కుమార్ ముఖ్య అతిథిగా హాజరై యువకులకు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గోలివాడ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ " బహుజన్ సమాజ్ పార్టీ బహుజన పేద బడుగు బలహీన వర్గాల పక్షాన నిలిచే ఏకైక పార్టీ బహుజన్ సమాజ్ పార్టీ అని అన్నారు, బీఎస్పీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ నాయకత్వాన్ని బలపరచాలని, రామగుండం నియోజకవర్గంలో బీఎస్పీ పార్టీలో చేరిన యువకులను సాదరంగా ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీఎస్పీ ఇంచార్జ్ గోలివాడ ప్రసన్న కుమార్ ఇందిరా నగర్ యూత్ సభ్యులు కల్వల సాయి దీపక్, జల్లంపల్లి వికాష్, సంటి విశ్వతేజ, పొన్నాల గోపి శివన్, పొన్నాల నవీన్ వంశీ, జల్లంపల్లి వివేక్, కల్వలనవీన్, కాసిపేట రాములు, కొంగర సందీప్ సూర్య, కాంపెల్లి వెంకటయ్య, మోదుంపల్లి శంకర్, కల్వల శేఖర్ లతో పాటు తదితరులకు పార్టీ కండువా కప్పి బీఎస్పీ పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు కాసిపేట స్వామి, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు పొన్నాల శ్రీనివాస్,జనగామ మల్లేష్, జనంపల్లి శ్రీనివాస్, అంతడుపుల రాజేందర్, రాచర్ల రాజ్ కుమార్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.



## CMRF చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి!

పెద్దపల్లి జిల్లా (వాయిస్ టుడే న్యూస్): పెద్దపల్లి నియోజకవర్గంలోని 173 మంది లబ్ధిదారులకి CMRF ద్వారా 50,91,600/- రూపాయల చెక్కులను అందచేసిన ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ,ఈ కార్యక్రమంలో ఎంపీపీ లు,జడ్పీటీసీ లు,మండల పార్టీ అధ్యక్షులు, మున్సిపల్ చైర్ పర్సన్లు, PACS ఛైర్మెన్లు, AMC ఛైర్మెన్ లు,డైరెక్టర్ లు,పట్టణాధ్యక్షులు,అనుబంధ సంఘాల అధ్యక్షులు, గౌరవ కౌన్సిలర్ లు,సర్పంచ్ లు, ఎంపీటీసీ లు, కో ఆప్షన్ లు,ఉప సర్పంచ్ లు, గ్రామ శాఖ అధ్యక్షులు,బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు,నాయకులు,కార్యకర్తలు తదితరులున్నారు.

## ఉచిత వైద్య ఎల్ ఎం ట్రస్టు చైర్మన్ కొప్పుల స్నేహలత!




పెద్దపల్లి జిల్లా: (వాయిస్ టుడే): ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎల్ ఎం ట్రస్ట్ చైర్మన్, సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ సతీమణి కొప్పుల స్నేహలత అన్నారు.ధర్మారం మండలంలోని కటికెన పల్లి గ్రామంలో కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి అద్వర్యంలొ నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి ఎల్ ఎం ట్రస్టు చైర్మన్ కొప్పుల స్నేహలత ముఖ్య అతిథిగా హాజరై ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ .. వైద్య శిభిరంలో మందులతో పాటు టెస్టుల నిర్వహణతో పేద ప్రజల ఆరోగ్యం పట్ల ఆందోళన చెందకుండా ఉండే వీలు కలుగుతుందన్నారు. ఉత్తర తెలంగాణలోనే గుండె వైద్య నిపుణులను కలిగివుండి ఎల్లవేళలా అన్ని రకాల స్పెషాలిటీ వైద్యసేవలు అందిస్తున్న ఏకైక ఆసుపత్రి మెడికవర్ అన్నారు . 200 మందికి, బీపీ, షుగర్, 2D Echo పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, సర్పంచ్ కారుపాకల రాజయ్య ఎంపీటీసీ సూరమల్ల శ్రీనివాస్, గుజ్జేటి కనకలక్ష్మి , ఆస్పత్రి అడ్మినిస్ట్రేషన్ గుర్రం కిరణ్ ,వైద్యులు డా.వేణు గోపాల్ (ఆర్థోపెడిక్ సర్జన్) ఎడా.ప్రవీణ్ (ఫిజిషియన్) మెనేజర్ దాసరి శ్రీకాంత్, ఎగ్జిక్యూటివ్ మహేష్ పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీలకు తప్పకుండా సమాధానం చెప్పాలి



వరంగల్(వాయిస్ టుడే) హనుమకొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్ భాస్కర్, వరంగల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎమ్మెల్యే ఆరూరి రమేష్ మరియు వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు,ఎంపీలు మేయర్ మరియు ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ మాట్లాడుతూ న్యాయపరంగా తెలంగాణకు దక్కాల్సిన హక్కులను బిజెపి మర్చిపోయిందని విభజన చట్టం హామీలో ఉన్న బయ్యారం హుక్కు పరిశ్రమ ఎప్పుడు ఇస్తారని ఎమ్మెల్యే ప్రశ్నించారు,ట్రైబల్ యూనివర్సిటీ,కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ముచ్చటే మరిచారని ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కి మళ్లీ ఓరుగల్లులో సభలు నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు సభలు సమావేశాలు ఎవరైనా పెట్టుకోవచ్చు కానీ ఇచ్చిన హామీలకు తప్పకుండా సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే అన్నారు. మా వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి కేటీఆర్ చెప్పినట్టు ఓరుగల్లు ప్రజలకు క్షమాపణ చెప్పి మోడీ వరంగల్ గడ్డపై రావాలని ఎమ్మెల్యే అన్నారు. ఇచ్చిన హామీలపై రోజుకో మాట మారుస్తూ తెలంగాణ ప్రజలను మోసం చేస్తుందని ప్రజలను మభ్య పెట్టే బిజెపి నాయకుల ప్రయత్నాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని గల్లీ గల్లీ నా వారిని అడ్డుకునే రోజులు వచ్చాయని ఎమ్మెల్యే అన్నారు. బిజెపి మోడీ ప్రభుత్వం దేశంలో అన్ని రంగాల ప్రజలను ఆగం చేస్తుందని ఇష్టానుసారంగా ధరలు పెంచి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని బీజేపీకి రోజులు దగ్గరపడ్డాయి అన్నారు. కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేంతవరకు మా పోరాటం కొనసాగుతూనే ఉంటుందని ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పేర్కొన్నారు.



## ఆధ్యాత్మిక జీవితంతో మానసిక ప్రశాంతత

**షిరిడి సాయిబాబా ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి**

**లోక కళ్యాణం కోసమే యజ్ఞాలు, యాగాలు.**

**నల్లబండగూడెంలో వ్యాస పూర్ణిమ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లం దంపతులు ప్రత్యేక పూజలు**

కోదాడ, జులై 2(వాయిస్ టుడే): ఆధ్యాత్మిక జీవితంతో మానసిక ప్రశాంతత ఆత్మబలం చేకూరుతుందని కోదాడ అభివృద్ధి ప్రధాత, శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. ఆదివారం కోదాడ మండల పరిధిలోని నల్లబండగూడెంలో శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో వ్యాస పూర్ణిమ సందర్భంగా లక్ష్మీ గణపతి, చండీ హెూమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ......పూర్వకాలం నుండి కూడా ప్రజలు సుభిక్షంగా ఉండాలని యజ్ఞాలు హెూమాలు ఆచరించడం తెలంగాణ ప్రజల సంస్కృతిగా వస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ లోక కళ్యాణం కోసం అనేకసార్లు యజ్ఞాలు యాగాలు చేశారన్నారు. ఈ ఏడాది వర్షాలు కురిసి పాడిపంటలు కలగాలని శ్రీ షిరిడి సాయిబాబాను వేడుకున్నట్లు పేర్కొన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ప్రజల మధ్య సోదర స్నేహ పూర్వక సంబంధాలు పెంపొందు తాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సర్వ మతాల ధర్మరక్షణకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్న అన్నారు. దేవాలయాలు ప్రజల సంస్కృతిక జీవన నాడులు అన్నారు. ఆలయాలలో జరిగే వేడుకలతో ప్రజల్లో ఆనందోత్సవాలతో పాటు భక్తి మార్గాలు పెరుగుతాయ అన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తమ వంతు సహకారాలు అన్నివేళలా ఉంటాయన్నారు. పూర్ణావధి కార్యక్రమంతో యాగాన్ని పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే తీర్థ ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింత కవిత రాధారెడ్డి, జెడ్పిటిసి కృష్ణకుమారి శేషు,సొసైటీ చైర్మన్ రమేష్, ఎంపిటిసి క్రాంతికుమార్, ఆలయ చైర్మన్ నల్లపాటి నరసింహారావు, మాజీ సర్పంచ్ రంగారావు, గ్రామ శాఖ అధ్యక్షులు కోటేశ్వరరావు, యూత్ ప్రధాన కార్యదర్శి గోపి, నాయకులు శీను, పూర్ణచంద్రరావు, ఆదినారాయణ, ముంద్ర నరసింహారావు, రంగారావు, తదితరులు పాల్గొన్నారు.




## డాక్టర్ లక్ష్మీప్రసన్నను సన్మానించిన మంత్రి జగదీశ్ రెడ్డి

కోదాడ/నడిగూడెం, జులై 2(వాయిస్టుడే): జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా సూర్యాపేటలో జరిగిన డాక్టర్స్ డే వేడుకలలో ఉత్తమ వైద్యాధికారి గా గౌరవ మంత్రివర్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు తీసుకున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, త్రిపురవరం వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీప్రసన్న, అవార్డు అందుకున్న డాక్టర్ లక్ష్మీప్రసన్నను పలువురు సన్మానించారు. అవార్డు అందుకున్న డాక్టర్ లక్ష్మీప్రసన్నకు నడిగూడెం ప్రెస్ క్లబ్ సభ్యులు, మండల ప్రజా ప్రతినిధులు వివిధ శాఖల అధికారులు , జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర నాయకులు ఏనుగుల వీరాంజనేయులు,అభినందనలు తెలిపారు.

## కార్గిల్ యుద్ధ వీరుల త్యాగాలు చిరస్మరణీయం

**లాన్స్ నాయక్ గోపయ్య చారి విగ్రహాన్ని ఆవిష్కరించి ఘన నివాళులర్పించిన ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్**

కోదాడు ,జూలై 2(వాయిస్ టుడే): భారత్ పాక్ మధ్య జరిగిన కార్గిల్ యుద్ధంలో అమరుడైన లాన్స్ నాయక్ పి.గోపయ్య చారి త్యాగం చిరస్మరణీయమని కోదాడ అభివృద్ధి ప్రదాత, శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలోని లారీ అసోసియేషన్ సమీపంలో జాతీయ రహదారిపై ఇండియన్ వేటరన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్గిల్ యుద్ధ వీరుడు లాన్స్ నాయక్ గోపయ్య చారి విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూశత్రువులు దేశ సరిహద్దులు దాటి రాకుండా సరిహద్దుల్లో నిలబడి పహారా కాసి దేశ ప్రజలకు కంటికి రెప్పలా కాపాడుతున్న సైనికుల త్యాగాలు వెలకట్టలేమన్నారు. కుటుంబాలను వదిలి జీవితాలను త్యాగం చేసి ప్రజలకు రక్షణ కల్పిస్తున్న సైనికులు నిజమైన దేవుల్లు అన్నారు. తెలంగాణ ప్రభుత్వం సైనికుల త్యాగాలను విస్మరించదన్నారు. దేశం కోసం ప్రాణం త్యాగాలు చేసిన సైనికుల కుటుంబాల కు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలబడిందన్నారు. ప్రణతిగంతో గోపయ్య చారి రాష్ట్ర పేరు ప్రఖ్యాతులను ప్రపంచవ్యాప్తంగా చాటారని కొనియాడారు. గోపయ్య చారి ఆశయాలను సాధించాలన్నారు. విగ్రహాన్ని ఏర్పాటు చేసిన వెటర్నర్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వెటర్నర్ అసోసియేషన్ సభ్యులు, గోపయ్య చారి కుటుంబ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్లు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## గుడిబండ గ్రామానికి చెందిన వివిధ కులాలకు చెందిన వంద కుటుంబాలు బిఆర్ఎస్ పార్టీలో చేరిక

కోదాడ, జులై 2(వాయిస్ టుడే ): బీఆర్ఎస్ సర్కార్ చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలు, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై ఇతర పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో గులాబీ తీర్థం పుచ్చుకుంటున్నారని కోదాడ అభివృద్ధి ప్రదాత శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. ఆదివారం కోదాడ మండలం గుడిబండ గ్రామానికి చెందిన వివిధ పార్టీల నుంచి 100 మంది కార్యకర్తలు ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ లో చేరిన వారికి గులాబీ కండువాలను కప్పి ఎమ్మెల్యే తమ పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...... సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధిని చూసి ప్రజలు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. ప్రతీ కార్యకర్త కుటుంబానికి గులాబీ పార్టీ అండగా నిలుస్తున్నదని భరోసా ఇచ్చారు బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాలు, పట్టణాల రూపురేఖలు మారిపోయాయని అన్నారు. ప్రతీ గ్రామంలో పల్లె ప్రకృతి వనం, వైకుంఠ ధామం,డంపింగ్ యార్డు, రైతు వేదికలను ప్రభుత్వం నిర్మిస్తున్నదని అన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం అధిక మొత్తంలో నిధులు మంజూరు చేస్తున్నదని అన్నారు. ప్రతీ పల్లెకు పక్కా రోడ్డును నిర్మించాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తున్నదని అన్నారు. గ్రామాల్లోనూ మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని అన్నారు. పేదింటి ఆడపిల్లల పెండ్లి కోసం కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాల ద్వారా రూ.1,00,116 మేనమామ కట్నంగా ప్రభుత్వం అందజేస్తున్నదని చెప్పారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యంగులు, వృద్ధులకు, బీడీ కార్మికులకు ప్రభుత్వం పెన్షన్ అందజేస్తున్నదని అన్నారు. దశాబ్దాల భూవివాధాలను తెరదించి భూయజమానులకు హక్కులు కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ధరణీ పోర్టల్ ను రూపొందించిందని అన్నారు. నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నదని అన్నారు.కోదాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నామని అన్నారు. రానున్న రోజుల్లో ఇతర పార్టీల నుంచి కూడా బిఆర్ఎస్ పార్టీకి భారీగా వలసలు ఉంటాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన ప్రతీ కార్యకర్త క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేసి కోదాడ నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కవిత రాధారెడ్డి,, గ్రామ శాఖ అధ్యక్షుడు సలీం,మండల మహిళా అధ్యక్షురాలు గీత, నాయకులు శేషు, ఖాజ,సురేష్, గాంధీ, బుచ్చయ్య, బిక్షం, అంబేద్కర్, ఆంజినేయులు, పార్టీలో చేరిన వారు పసుపులేటి నాగరాజు, నరేష్, వీరబాబు, రాములు, సైదులు, నాగరాజు, వెంకటనారాయణ, రమేష్, నర్సి, ఆత్మూరు భాస్కర్, పసుపులేటి సైదులు, జానకి, సీతమ్మ, నాగమణి, ఆత్మూరు నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, నర్సమ్మ, నాగేశ్వరరావు, కృష్ణ, వెంకటనారాయణ, శ్రీను, నాగమణి, ఉపేందర్, సురేష్, జీడిమెట్ల పవన్, తదితరులు పార్టీలో చేరారు.

## విద్యుత్ షాక్‌తో రెండు ఆవుల మృతి

కోదాడ, జులై 2(వాయిస్ టుడే.) సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం బొజ్జగూడెం తండా చివర్లో ,ఉన్న హైవే పవర్ మేక్ అనే కంపెనీ వద్ద ఎటువంటి భద్రతా లేకుండా ట్రాన్స్ఫారం ఏర్పాటు చేయడంతో. రెండు ఆవులు మేత మేసేందుకు వెళ్లి మృతి చెందాయి. బొజ్జ గూడెం తండా గ్రామానికి చెందిన గూగులోత్ కమలాకు చెందిన ఆవులు మృతి చెందాయి. రెండు లక్షల పరిహారం ఇప్పించాలని రైతు కోరారు.

## ప్రొఫెసర్ గడ్డం రామ్ రెడ్డి విగ్రహానికి ఘనంగా నివాళులు

కరీంనగర్: దూరవిద్య పితామహుడు, మేధావి,మన జిల్లా వాసి అయనటువంటి శ్రీ ప్రొఫెసర్ గడ్డం రామ్ రెడ్డి 28 వ వర్ధంతి సందర్భంగా ఈ రోజు ప్రొఫెసర్ రాం రెడ్డి విగ్రహ కమిటీ పెద్దలు శ్రీ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో లో, స్థానిక ఎస్.ఆర్.ఆర్.కళాశాల ఎదురుగా ఉన్న ఆర్.బి.వి.ఆర్.ఆర్ కూడలి లో ఉన్న ప్రొఫెసర్ గడ్డం రామ్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమము లో రెడ్డి సంఘం బాధ్యులు,వివిధ వర్గాల విద్యావేత్తలు,ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి నివాళులు అర్పించారు.రెడ్డి సంఘం పెద్దలు ఉచ్చిడి మోహన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రొఫెసర్ రాం రెడ్డి దేశం లోనే మొదటిసారిగా దూరవిద్య ను ప్రవేశ పెట్టి చదువుకు దూరమైన ఎందరో విద్యార్థులకు తిరిగి చదువును చెప్పించిన గొప్ప మేధావి అని,విద్యారంగానికి చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమములో ఆర్.బి.వి.ఆర్.ఆర్ రెడ్డి సంఘం అధ్యక్షులు శ్రీ నరహరి జగ్గారెడ్డి కార్యదర్శి బండ గోపాల్ రెడ్డి ఉపాధ్యక్షులు ఎడబోయన శ్రీనివాస్ రెడ్డి రేకులపల్లీ రవీందర్ రెడ్డి సంయుక్త కార్యదర్శి దారం జగన్నాథ్ రెడ్డి ,ప్రముఖ న్యాయవాది బేతి మహేందర్ రెడ్డి సెంట్రల్ సెన్సార్ బోర్డ్ మెంబర్ న్యాలకొండ ప్రసన్న రెడ్డి రావుల కిరణ్ కుమార్ రెడ్డి చింతల శ్రీనివాస్ రెడ్డి రెడ్ క్రాస్ అధ్యక్షులు పెండ్యాల కేశవ రెడ్డి కార్యదర్శి ఉట్కూరి రాధాకృష్ణ రెడ్డి,అంజనా రెడ్డి ఆకారపు భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సీలింగ్ భూమి కబ్జా

మంత్రి మల్లారెడ్డి ఇలాకాలో సీలింగ్ అసైన్డ్ భూములకు రక్షణ కరువు
పేరుకు ఆనిముత్యాలు చేసేటివన్నీ ఆక్రమణలు అక్రమాలు
పుడమి స్కూల్ వెనుక గల సీలింగ్ భూమిలో విచ్చలవిడిగా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు
నాడు కూల్చిన నిర్మాణాలు నేడు పునరావృతం అవుతున్న వైనం
చర్యలు తీసుకోవలసిన అధికారుల తీరుపట్ల అనుమానాలు

**నగర శివారు గ్రామాల్లో అసైన్డ్ భూములు సీలింగ్ భూములు అన్ని ఆక్రమణకు గురవుతున్నాయి... ఏకంగా మేడ్చల్ నియోజకవర్గం ఎమ్మెల్యే... రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి ఇలాకలోనే ఈ తంతు జరుగుతుండడం చర్చనీయాంశం... ఘట్కేసర్ కీసర మండల్ ఈ ప్రాంతాల్లో భూముల ధరలు ఎకరా నాలుగు నుంచి ఐదు కోట్లలో పలుకుతుంది... అక్రమార్కులకు ఇదే అదునుగా మారి ఏకంగా అసైన్డ్ భూములు సీలింగ్ భూములకు ఏసరు పెట్టడం మొదలుపెట్టారు... ఇంకేముంది రెవెన్యూ అధికారులను అధికార పార్టీ నాయకులను లోబర్చుకొని కబ్జాలకు యత్నిస్తున్నారు... తూతూ మంత్రంగా అక్రమ నిర్మాణాలను కూల్చివేయడం అధికారుల వంతైంది... దీంతో భూ ఆక్రమణదారులకు అడ్డు అదుపు లేకుండా పోతుంది... ఇదే పరిస్థితి కొనసాగితే ఈ ప్రాంతాల్లో ప్రభుత్వ భూమి గజం కూడా మిగిలే అవకాశం లేకుండా పోయే ప్రమాదం ఉంది.**



మేడ్చల్ ప్రతినిధి (వాయిస్ టుడే) జూలై 2: ఘట్కేసర్ మండల పరిధిలోని కొండాపూర్ గ్రామపంచాయతీ ప్రాంతంలో గల పుడమి స్కూల్ వెనక ఉన్నటువంటి 153 , 218 , 219 సర్వే నంబర్లు గల కోట్ల విలువచేసే సీలింగ్ భూమి కబ్జా కు గురైంది, ఈ సీలింగ్ భూమిని కబ్జా చేసి ప్లాట్లుగా విభజించి చట్టానికి సవాల్ విసురుతూ చట్టం నా చుట్టమే అన్నట్లుగా ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలో పేరుమోసిన కాంట్రాక్టర్ గా చలామణి అవుతున్న వ్యక్తి కొన్ని నెలల క్రితం ఈ సీలింగ్ భూమిలో అక్రమ మార్గంలో నిర్మాణాలు చేపట్టిన విషయం వెలుగు చూసింది, దీంతో ప్రభుత్వ భూముల పరిరక్షనే ధ్యేయంగా విధి నిర్వహణలో ఉన్న రెవెన్యూ అధికారులు తక్షణమే జెసిబి సహాయంతో అక్రమ నిర్మాణాలను తొలగించి ఈ సీలింగ్ భూమిని ఎవరైనా కబ్జా చేసేందుకు ప్రయత్నించినా అక్రమంగా నిర్మాణాలు చేపట్టేందుకు సాహసించినా, వారు ఎవరైనా ఎంతటి వారైనా ఉపేక్షించకుండా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేయడం జరిగింది, అయినప్పటికీ రెవెన్యూ అధికారుల ఆంక్షలను బేకాతరు చేస్తూ నేడు మళ్లీ కూల్చిన నిర్మాణాలను పునరవృతం చేయడమే కాకుండా ఎన్నో నూతన నిర్మాణాలు చేపడుతుంటే , ఈ సీలింగ్ భూమిని పరిరక్షించడమే ఏకైక లక్ష్యంగా గతంలో కూల్చివేతలు జరిపిన రెవెన్యూ యంత్రాంగం నేడు పెద్ద మొత్తంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ , ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారుల తీరుపట్ల స్థానికుల నుండి అనేకమైన అభ్యంతరాలు అనుమానాలు వ్యక్తం వ్యక్తమవుతున్నాయి

### కబ్జాదారునిపై అనేకమైన విమర్శలు

అధికార పార్టీ ఉన్నత స్థాయి నాయకుల అండదండలు కూడగట్టుకుని సీలింగ్ అసైన్డ్ భూముల ఆక్రమణకు పాల్పడుతూ గుట్టు చప్పుడు కాకుండా 60 గజాలు 80 గజాల ప్లాట్లుగా విభజించి లక్షల్లో అమాయక ప్రజలకు విక్రయిస్తూ లంచాల రూపంలో లక్షలు వెదజల్లి కోట్లు దండుకోవడమే ఈ సీలింగ్ భూమి కబ్జాకు పాల్పడిన ఆనిముత్యాల ఏకైక లక్ష్యమని అధికారులతో పాటు ఏ విధమైన విమర్శలు రాకుండా చూసుకునే విషయంలో దిట్ట ఇతను పేరుకే ఆణిముత్యం కానీ చేసేటివన్నీ ఆక్రమణలు అక్రమాలే అనే విమర్శలు కో కొల్లలుగా వినిపిస్తున్నాయి, ఈ సర్వే నెంబర్లకు చెందిన సీలింగ్ భూమే కాకుండా పోచారం మున్సిపాలిటీ ప్రాంతంలో గల 36 సర్వే నెంబర్ కు చెందిన సీలింగ్ భూమి కూడా త్వరలో ఈ ఆనిముత్యాల హస్తగతం కాబోతుందనే వినికిడి కూడా ఉంది

### రెవెన్యూ అధికారుల తీరు పట్ల వెలువడుతున్న అనుమానాలు

చట్టానికి సవాల్ విసురుతూ అధికారుల ఆంక్షలను బేఖాతరు చేస్తు నేనే రాజు నేనే మంత్రి అన్న చందంగా, ఏదేచ్ఛగా సీలింగ్ అసైన్డ్ భూముల కబ్జాలకు పాల్పడుతూ ఏకంగా అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తుంటే, ఈ స్థలాలను పరిరక్షించడమే ధ్యేయంగా,విధి నిర్వహణలో ఉన్న రెవెన్యూ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంలో ఆంతర్యం ఏమిటీ...? మామూళ్ల మహత్యమా ...? అధికారుల నిర్లక్ష్యమా ...? అక్రమార్కుల దుస్సాహసమా...? అనే అనుమానాలు స్థానికుల నుండి వినిపిస్తున్నాయి, ఇలాంటి అనుమానాలకు తావివ్వకుండా అధికారులు నిబద్ధతతో విధులు నిర్వహిస్తే, ఈ సీలింగ్ భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాల వ్యవహారం ఎలా సాగుతుంది, గతంలో ఈ సీలింగ్ భూమిలో వెలిసిన నిర్మాణాలను తొలగించి అధికారికంగా హెచ్చరికలు జారీ చేసిన అధికారుల ఆంక్షలను బేకాతర్ చేస్తూ మళ్లీ నిర్మాణాల పర్వం కొనసాగిస్తున్న అటువైపు రెవెన్యూ యంత్రాంగం కన్నెత్తి చూడకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం, అధికారులు విధినిర్వహణలో ప్రభుత్వం ఇచ్చే జీతాల కన్నా అక్రమార్కుల నుండి వచ్చే అధిక సంపాదనకు ఆసక్తి చూపుతూ విధి నిర్వహణలో అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు అనడానికి నిలువెత్తు నిదర్శనం ఈ సీలింగ్ భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాలు కాదా...? అని స్థానికులు నిలదీస్తున్నారు, ఈ సీలింగ్ భూమి కబ్జాతో పాటు అక్రమ నిర్మాణాల వ్యవహారంపై ఆర్డీవో జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి, చట్టానికి సవాల్ విసురుతూ ఈ భూమి కబ్జాకు పాల్పడిన అక్రమార్కులపై, ఈ భూమిని పరిరక్షించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై, ప్రత్యేక దర్యాప్తు జరిపించి, ఈ సీలింగ్ భూమిని పరిరక్షించి, విధి నిర్వహణలో అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న అధికారులపై, కబ్జాకు పాల్పడిన అక్రమార్కులపై, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు,



# పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కోదాడ ,జులై 2(వాయిస్ టుడే): ఆదివారం నాడు ఈ వి రెడ్డి డిగ్రీ కళాశాల 2001–04 బీఎస్సీ (ఎంపీసి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శ్రీ సాయి గార్డెన్స్ దోరకుంట లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆనాటి గురువులు యస్.రమేష్, ఆర్.వెంకటేశ్వరరావు,సేకు శ్రీనివాసరావు, కొల్లుశ్రీనివాస్, బి.వేంకటేశ్వర్లు, ఎ.బిక్షమాచారి, యం.లక్షణా చార్యులు, గోపతి శ్రీనివాసరావు, బి.కోటిరెడ్డి, యన్ శ్రీనివాసరావులను విద్యార్థులు పూలమాలలతో సత్కరించి, శాలువాలతో మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఈ వి రెడ్డి విద్యా సంస్థల చైర్మన్ యస్ యస్ రావు మాట్లాడుతూ విద్యార్థులు 19 సంవత్సరాల తర్వాత గురువులను ఇలా కలుసుకోవడం ,ఈ బ్యాచ్ విద్యార్థులందరూ ఉపాధ్యాయులుగా, పోలీస్ శాఖలో,వివిధ రంగాలలో స్థిర పడటం ఎంతో ఆనందాన్ని కలిగించింది అని అన్నారు.ఏ రంగంలో ఉన్నప్పటికీ వారు నీతి నిజాయితీ తో ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమం చేసినందుకు నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు శెట్టి సురేష్, గని, నర్సయ్య, సైదులు, రామకృష్ణ, మమత, గీత, అనంతలక్ష్మి, నాగరాజు, శంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



# పోడు భూములకు పట్టాలు పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

కామారెడ్డి జిల్లా, జులై02(వాయిస్ టుడే ప్రతినిధి) గిరిజనుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. కామారెడ్డి పట్టణంలోని కెవిఆర్ గార్డెన్ లో ఆదివారం గిరిజనులకు పోడు భూముల పట్టాలను పంపిణీ చేసే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ పోడు పట్టాలను గిరిజనులకు ఇవ్వాలని నిర్ణయించారని తెలిపారు. తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటుచేసిన ఘనత తమ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. గిరిజనులు ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యే అవకాశం లభించిందన్నారు. తండా ల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇవ్వడం వల్ల తండాలో మార్పు కనిపిస్తుందని చెప్పారు. సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడారు. వందల ఏళ్లుగా గిరిజనులు అటవీ సంపదను కాపాడుకుంటూ వచ్చారని తెలిపారు. ప్రభుత్వం అర్హత గల గిరిజనులకు పోడు భూములను పంపిణీ చేసిందని చెప్పారు. గిరిజనులు తమ పిల్లలను ఉన్నత విద్యావంతులుగా మార్చాలని కోరారు. ఈ సందర్భంగా 668 మంది లబ్ధిదారులకు 1668 ఎకరాలు పోడు భూమి పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబుద్దిన్, ఎంపీపీ నర్సింగ్ రావు, జెడ్పిటిసి సభ్యుడు రామ్ రెడ్డి, రామారెడ్డి ఎంపీపీ దశరథ్ రెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి, అధికారులు, ప్రజా ప్రతినిధులు, మాచారెడ్డి, రామారెడ్డి మండలాల గిరిజనులు పాల్గొన్నారు.



# కరీంనగర్ విశ్వ ఆయుర్వేద పరిషత్ విభాగం నూతన కార్యవర్గం ఎన్నిక

కరీంనగర్, జూలై 02( కరీంనగర్): జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా కొత్తపల్లి సమీపంలోని వసుధ కన్ వెన్షన్ నందు విశ్వ ఆయుర్వేద పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు డా. ప్రేమానంద రావు,రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షులు డా. బి. కిషన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. శ్రీనివాస రెడ్డి ఆయుష్ రీజినల్ డిప్యూటి డైరెక్టర్ డా. రవినాయక్ ఆధ్వర్యంలో నూతన ఉమ్మడి జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులుగా డా. దశరథ్ నాయక్, కార్య నిర్వాహక అధ్యక్షులుగా డా. అమరనాథ్ మరియు ఉపాధ్యక్షులు, ఉప కార్య నిర్వాక అధ్యక్షులు, ఇతర సభ్యులను ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ బాధ్యులు డా. ప్రేమానంద రావు మాట్లాడుతూ అందరు ఆయుర్వేద వైద్యులు విశ్వ ఆయుర్వేద పరిషత్ సభ్యత్వం తీసుకొని మరింత బలోపేతమై ఆయుర్వేద అభ్యున్నతికి కృషిచేయాలన్నారు. డా. కిషన్ మాట్లాడుతూ అందరం ఐక్యంగా ఉంటె మరిన్ని కార్యక్రమాలు నిర్వహించుకొని మన సమస్యలన్ని పరిష్కరించుకునే అవకాశముందన్నారు .డా. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ వివిధ హోదాలలో పని చేస్తున్న ఆయుర్వేద వైద్యుల సమస్యలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకు వెళ్లే ప్రయత్నం చేస్తామన్నారు. డా రవి నాయక్ మాట్లాడుతూ మీరు మీ మీ విధుల్ని సక్రమంగా, ధైర్యంగా నిర్వహించండి మీకు అండగా మేముంటామన్నారు .డా .సదానందం, డా. ఆనందరెడ్డి డా. తిరుపతి రెడ్డి యువ వైద్యుల్లో ఉత్సాహం నింపే ప్రయత్నం చేశారు. కార్యక్రమంలో పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల మరియు హుస్నాబాద్ లనుండి అధిక సంఖ్యలో ఆయుర్వేద వైద్యులు పాల్గొన్నారు.నూతనఅధ్యక్షులుగా ఎన్నికైన డా. దశరథ్ నాయక్ మాట్లాడుతూ నాకు ఈ అవకాశం ఇచ్చిన పెద్దలకు కృత్ణతలు తెలుపుతూ ఆయుర్వేద వైద్యుల సమస్యల్ని అందరి సహకారంతో పరిష్కరించే ప్రయత్నం చేస్తామన్నారు.కార్య నిర్వాహక అధ్యక్షులు డా అమర్ నాథ్ మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా ఉండి ఆయుర్వేదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ఆయుర్వేద వ్యాప్తికి కృషి చేద్దామన్నారు.

# కాంగ్రెస్‌లో భారీ చేరికలు

## కండువా కప్పి స్వాగతం పలికిన నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



కరీంనగర్, జూలై : 02( వాయిస్ టుడే): నగర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 53,54 డివిజన్ల కు చెందిన దాదాపు రెండు వందల మంది ఉప్పరి అజయ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కండువా కప్పి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మాత్రమే అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పని చేస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు.ప్రజల అభీష్టం మేరకే ఇతర పార్టీల నుండి పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ లో చేరుతున్నారని అన్నారు.తొమ్మిదేళ్ళ బిఆర్ఎస్,బిజెపి పాలనతో ప్రజలు విసిగిపోయి ఉన్నారన్నారు.గడపకు గడపకు కాంగ్రెస్ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరినీ కలిసే కార్యక్రమం చేపట్టామని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే పథకాలను ప్రతి ఇంటికి కరపత్రం ద్వారా తెలియజేస్తామని పేర్కొన్నారు.చేరిన వారిలో తమ్మదేవని అఖిల్,మేడిపల్లి హరీష్,మేడిపల్లి తరుణ్,ఊట్ల జాన్ తో పాటు దాదాపు రెండు వందల మంది చేరారు.ఈ కార్యక్రమంలో సమద్ నవాబ్,చర్ల పద్మ,ఎండి తాజ్,శ్రవణ్ నాయక్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి,కుర్ర పోచయ్య, సయ్యద్ అఖిల్,దండి రవీందర్, సయ్యద్ ఖంరొద్దీన్,ఎండి చాంద్,దన్న సింగ్,షేక్ శేహెన్ష,షబానా మహమ్మద్, ఊరడి లత,ముల్కల కవిత,అన్నే జ్యోతి,పద్మ,మెతుకు కాంతయ్య, మామిడి సత్యనారాయణ రెడ్డి,తమ్మడి ఎజ్రా,నేహాల్ అహ్మద్,కాంపల్లి కీర్తి కుమార్, సిరాజొద్దీన్,నదీమ్,ఎండి భారీ, హనీఫ్,యోనా,కమల్ పాల్గొన్నారు.



# ఆషాడ మాస మున్నూరు కాపు బోనాలు

## ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్నూరు కాపు ఆందోల్ నియోజకవర్గం అధ్యక్షులు మున్నూరు మల్లేష్ పటేల్.

రేగోడు : సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం మండల పరిధిలోని పోచారం గ్రామానికి చెందిన మున్నూరు మల్లేష్ పటేల్ ఆదివారం రేగోడు మండల కేంద్రంలోని ఆషాడ మాసం బోనాల ఉత్సవాలను మున్నూరు కాపులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న అనంతరం ఆందోల్ నియోజకవర్గం మున్నూరు కాపు అధ్యక్షులు మల్లేష్ పటేల్ విలేకరులతో మాట్లాడారు.వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో మరియు అందోల్ నియోజకవర్గం లోని ఎమ్మెల్యే ఎన్నికల్లో గెలుపోవటములను నిర్ణయించేది మున్నూరు కాపులేనని మల్లేష్ పటేల్ పేర్కొన్నారు. మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని గత కొంతకాలంగా తాము డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు. తమ ఓట్లు లేకుండా ఏ పార్టీ కూడా అధికారం లోకి రాలేదన్నారు. నియోజకవర్గంలో 32 వేల ఓటు బ్యాంకు ను కలిగి ఉన్నది కేవలం మున్నూరు కాపులేనని ఆయన స్పష్టం చేశారు. మున్నూరు కాపులకు వారి అభ్యున్నతికి స్పష్టమైన హామీ ఇచ్చే వారికే తమ మద్దతు ఉంటుందని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రేగోడు మండల్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు మున్నూరు కిషన్ పటేల్ ఉపాధ్యక్షులు రాధా కిషన్ మరియు గ్రామ మున్నూరు కాపు భారీ ఎత్తున పాల్గొని అమ్మవారికి బోనాలుబోనాలు సమర్పించారు.

# ప్రైవేట్ విద్యా వ్యవస్థలో నూతన ఒరవడి సృష్టించే విధంగా అడుగులు



కరీంనగర్, జూలై 02( వాయిస్ టుడే): కరీంనగర్ పట్టణంలోని పరిమిత పాటశాల చైర్మన్ రా 7ఈ ప్రసాద రావు విద్యలో నూతన ఓరవడి కోసం విదేశాలలో విద్య విధానాన్ని పరిశీలించడానికి వెళ్తున్న సందర్భంగా ప్రైవేట్ పాఠశాలల అధ్యక్షుడు శేఖర్ రావు వారిని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శేఖర్ రావు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థలు నడుపుతూ విద్యా సేవలో వినూత్న ఆలోచనలతో, విధివిధానాలతో ఎప్పటికప్పుడు నూతన ఓరవడిని మరియు కొత్త పద్ధతులను అవలంబిస్తూ పాఠశాల నిర్వహిస్తున్న ట్రస్మా ప్రతినిధులు డా ఈ ప్రసాదరావు, డా జేఎస్ పరంజ్యోతి,కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి,భారత దేశంలోని ఇతర రాష్ట్ర ప్రతినిధులతో కలిసి లండన్ లోని ప్రముఖ యూనివర్సిటీలైన ఆక్స్ ఫర్డ్ మరియు కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలను సందర్శించి అక్కడి విద్యా విధానాన్ని పరిశీలించి, వారు అవలంబిస్తున్న పద్ధతులను అధ్యయనం చేసి వాటిని మన దేశ పరిస్థితులకు అనుగుణంగా మార్చి మనకు అవసరమయ్యే విధంగా వాటిని తీర్చిదిద్ది మన రాష్ట్ర విద్యారంగంలో ఒక నూతన ఓరవడిని సృష్టించడానికి లండన్ బయలుదేరుతున్న శుభసందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఇంత మంచి కార్యక్రమానికి బయలుదేరుతున్న వారు భగవంతుని ఆశీర్వాదాలతో దిగ్విజయంగా తిరిగి రావాలని అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు, కిమ్స్ కాలేజ్ చైర్మన్ రవీందర్ రావు, ట్రస్మా నాయకులు సౌగాని కొమరయ్య పాల్గొన్నారు.

# బిజెపి, బిఆర్ఎస్ 9 ఏళ్ల పాలనలో ధరలు పెరగడం తప్ప తగ్గించలేదు: చెర్ల పద్మ



కరీంనగర్, జూలై 02( వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావు పిలుపు మేరకు, నేడు కరీంనగర్ పట్టణంలోని ఇందిరా చౌక్ లో టిపిసిసి మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు చెర్ల పద్మ ఆధ్వర్యంలో బిజెపి బిఆర్ఎస్ ప్రభుత్వాల వైఫల్యాల వలన రోజురోజుకు పెరుగుతున్న వంటగ్యాస్, కూరగాయల ధరలను నిరసిస్తూ, తలపై కూరగాయల బుట్ట పెట్టుకొని, మెడలో కూరగాయల మాలలను ధరించి, ఇందిరా చౌక్ లో తిరుగుతూ ప్రజలకు నిత్యావసరాల ధరల పెరుగుదలను తెలియజేస్తూ వినూత్నంగా నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి హాజరై సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా చెర్ల పద్మ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అసమర్ధ పాలన వల్ల నేడు విపరీతంగా పెరిగిపోయిన నిత్యావసరాల ధరలు మరియు పెట్రోల్ డీజిల్ పెరుగుదలలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడం వలన రవాణా వ్యవస్థ పై పడిన భారంతో కూరగాయల ధరలు పెరిగిపోతున్నాయి, ఈ అసమర్ధ ప్రభుత్వాల 9 ఏళ్ల పాలనలో ధరలు పెరగడం తప్ప తగ్గించలేదు, పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో ఆర్టీసీ చార్జీలు, ప్రైవేటు స్కూల్లో ఫీజులు సైతం పెరుగుతున్నాయి, పేద మధ్యతరగతి ప్రజలు కనీసం కూరగాయలతో కూడా రెండు పూటలా భోజనం చేయలేని పరిస్థితి, గతంలో ఎన్నడు లేని విధంగా టమాటా, మిర్చి, బెండకాయలు ధర కిలో 100 రూపాయలు, వంట గ్యాస్ సిలిండర్ ధర 1200 దాటిపోయింది, ఈ పరిస్థితుల్లో సామాన్య మధ్యతరగతి ప్రజలు కుటుంబాలను ఎలా పోషించుకోగలరు, స్వరాష్ట్రంలోనూ తెలంగాణ మహిళల పరిస్థితి దిన దిన గండం గా మారింది, ఇదేనా బంగారు తెలంగాణ అంటే అని మహిళలు రోదిస్తున్నారు, గత కాంగ్రెస్ ప్రభుత్వంలో రేషన్ దుకాణాలలో 9 సరుకులు ఇవ్వడంతో పాటు 100 రూపాయలు పెడితే 5 రోజులు సరిపడా కూరగాయలు వచ్చేవి, వంట గ్యాస్ 400 ఉండేది, లీటర్ పెట్రోల్ 60 రూపాయలు మించేది కాదు, కానీ ఇప్పుడు రైతులు పండించిన పంట నుండి మొదలు లిక్కర్ వరకు అన్ని రంగాలలో దోపిడీ, కుంభకోణాలు జరుగుతున్నాయి, దేశ ప్రజలందరూ గత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను కోరుకుంటున్నారు, వెంటనే పెరిగిన ధరలను నియంత్రించకపోతే మోడీ కేసీఆర్ ప్రభుత్వాలను పడగొట్టి మహిళా చైతన్యం అంటే ఏమిటో చూపిస్తాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకులు షబానా, కవిత, లతా, శారద, పద్మ, మహాలక్ష్మి, మానకొండూర్ కవిత, సులోచనజ్యోతి, మంజుల, రేణుక, కవిత, కాంగ్రెస్ నాయకులు శ్రావణ్ నాయక్, కుర్ర పోచయ్య, షాహెన్షా గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.



## నిజామబాద్ జిల్లా పెద్దగుట్ట సాదుల్ల బాబాను దర్శించుకున్న ఎఫ్డీసి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, షేక్ బురాన్

మెదక్ వాయిస్ టుడే న్యూస్ :- మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీ మైనార్టీ అధ్యక్షులు షేక్ బురాన్ ఆధ్వర్యంలో తన సొంత డబ్బులతో స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రజా ప్రతినిధులతో పెద్దగుట్ట సాదుల బాబా బడా పహాడ్ దర్గాను దర్శించుకున్నారు. వారి వెంబడి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఎఫ్డీసి చైర్మన్ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, జడ్పిటిసి రాణి సత్యనారాయణ గౌడ్ మున్సిపాలిటీ కౌన్సిలర్లు , నారాయణ గుప్తా, రవీందర్ రెడ్డి, వైస్ చైర్మన్ దీపక్ రెడ్డి లు హాజరై మైనార్టీ నాయకులు షేక్ బురాన్‌తో కలిసి పూల జడీలు, పూల చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేసి నాజు చేయడం జరిగింది. అనంతరం అనంతరం ఎఫ్. డి. సి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి , స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ షాదుల్లా బాబా ఆశీర్వాదాలు ఉండి ప్రజలు సుఖసంతోషాలు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ మెదక్ జిల్లాలో మైనార్టీ నాయకులు షేక్ బురాన్ బిఆర్ఎస్ పార్టీలో కీలకంగా పనిచేస్తు , పార్టీ నాయకులందరినీ సమన్వయం చేస్తూ బిఆర్ఎస్ పార్టీ అభివృద్ధికి సహకరిస్తున్నాడని షేక్ బురాన్ కు పార్టీ అండదండలు ఎప్పుడు ఉంటాయని, రాబోయే కాలంలో మరింత ఉన్నతమైన హోదాలో ఉండాలని ఆశిస్తున్నానని మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్మెంట్ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి, జెడ్పిటిసి రాణి సత్యనారాయణ గౌడ్ ,తూప్రాన్ మున్సిపల్ కౌన్సిలర్లు నారాయణ గుప్తా, రవీందర్ రెడ్డి , మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు భగవాన్ రెడ్డి, రఘుపతి బిఆర్ఎస్ పార్టీ నాయకులు సతీష్ చారి, కృష్ణారెడ్డి, బజార్ చక్రవర్తి, మాజీ ఉప సర్పంచ్ రహీం భాయ్, పల్లె ప్రభాకర్ రెడ్డి కృష్ణారెడ్డి , పిఎసిఎస్ వైస్ చైర్మన్ దీపక్ రెడ్డి, మాజీ ఎంపీపీ గుమ్మడి శ్రీనివాస్, దామోదర్ రెడ్డి, పొడలపల్లి రమేష్, తూప్రాన్ మండలం మైనార్టీ నాయకులు మహమ్మద్ అహ్మద్, మొహమ్మద్ హుస్సేన్ , షేక్ రెహన్ , ఆసిఫ్ బాయ్, నూరి, షేక్ అఖిల్, షబ్బీర్, షేక్ భాష సీనియర్ నాయకులు మన్నే శ్రీనివాస్,, నాచారం దేవస్థానం డైరెక్టర్ చంద్రారెడ్డి , విశ్వం ఎండి జలీల్ అస్మొద్దీన్ , ఆత్మ కమిటీ డైరెక్టర్ హాయ్ ఉమర్, గంగాధర్ వెంకటేష్ , శ్రీనివాసరెడ్డి, భూషణం చారి, నగేష్ మహమ్మద్ గౌస్ షేక్ మాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ షబ్బీర్ షేక్ పాషా, షేక్ అహ్మద్ భాషా ఎండి ఉమర్, అఖిల్ ఆసిఫ్ హుస్సేన్ ఆరిపాక భూషణం చారి తూప్రాన్ మండల మున్సిపాలిటీ బిరెఎస్ పార్టీ నాయకులు , ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి హరీష్ రావును కలిసిన తూప్రాన్ ముదిరాజ్ సంఘం నాయకులు

### సానుకూలంగా స్పందించిన మంత్రి హరీష్ రావు



మెదక్ తూప్రాన్ న్యూస్ :- మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శ్రీ పెద్దమ్మ గుడి నిర్మాణం భక్తిశ్రద్ధలతో ఎంతో వైభవంగా ఆకర్షణీయంగా నిర్మాణం జరుగుతుంది. ఆదివారం నాడు నాచారం టెంపుల్ మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరి, 4 వార్డు కౌన్సిలర్ మామిళ్ల జ్యోతి కృష్ణ ఆధ్వర్యంలో ముదిరాజ్ సంఘం నాయకులు తెలంగాణ రాష్ట్ర ఆర్థిక ఆరోగ్య శాఖ మంత్రివర్యులు హైదరాబాద్ తన నివాస క్యాంపు కార్యాలయంలో కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మహిమగల శ్రీ పెద్దమ్మ గుడి నిర్మాణానికి సహకరించాలని మంత్రి హరీష్ రావు లకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సానుకూలంగా స్పందించిన మంత్రి హరీష్ రావు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో దేవాలయమునకు ఎంతో ప్రాముఖ్యత ఉందని తప్పకుండా నా వంతు ప్రభుత్వ సహకారాలు అందుతాయని వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తిమ్మాపురం నరసింహులు, ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సింగపూర్‌లో మంత్రి గంగుల, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌లకు స్వాగతం



కరీంనగర్, జులై 02 (వాయిస్ టుడే): డెలిగేషన్ బృందం సింగపూర్, సీయోల్, ఒసో లో అధ్యయనం చేసేందుకు గురువారం వెళ్లగా శుక్రవారం దక్షిణ కొరియా చేరుకుంది. బృందంలో మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ తోపాటు కలెక్టర్ ఆర్వీ కర్ణన్, ప్రిన్సిపల్ సెకట్రరీ రజత్‌కుమార్, పర్యాటకశా ఖ ఎండీ లు ఉన్నారు. మానేరు రివర్ ఫ్రంట్ అభివృద్ధిలో భాగంగా దక్షిణ కొరియా వెళ్లిన తెలంగాణ మంత్రులు మరియు అధికారులకు బృందానికి విమానాశ్రయంలో విదేశీ వ్యవహారాల ఇంచార్జి స్వాగతం పలికారు. సింగపూర్‌తోపా టు సౌత్ కొరియాలోని సియోల్, ఓసోలో పర్యటించనున్నన్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు లో చేపడుతున్న బిగ్ ఓ ఫౌంటెయిన్ ఒసోలోనే ఉంది, అక్కడ ఉన్న దానికంటే ఇక్కడ ఆధునిక టెక్నాలజీని తీసుకువచ్చేందుకు ప్రయత్నా లు చేసేందుకు ఈ బృందం స్టడీ టూర్ కు వెళ్ళింది. ఒసో రివర్ ఫ్రంట్‌లోని ఎలిమెంట్లను కరీంనగర్ తేవాలన్నదే తమ లక్ష్యమన్నారు మంత్రి గంగుల. సింగపూర్‌లో అమెరికన్ టెక్నాలజీతో నిర్మించిన యూనివర్సల్ స్టూడియోని అధ్యయ నం చేస్తామన్నారు. గుజరాత్‌లోని సబర్మతీ రి వర్ ఫ్రంట్ కంటే అధునాత నంగా, మన రాష్ట్రానికే గర్వకారణంగా మానేరు రివర్ ఫ్రంట్‌ను నిర్మిస్తామని స్పష్టం చేశారు.



## నాణ్యమైన ఆహార పదార్థాలను అందించి వృద్ధిలోకి రావాలి

### గూడెం మహిపాల్ రెడ్డి, కాలే యాదయ్య

చేవెళ్ల,జూలై 2 వాయిస్ టుడే: కస్టమర్లకు నాణ్యమైన ఆహారాన్ని అందించి మంచి పేరు సంపాదించుకొని ప్రజల అభిమానాన్ని పొందాలని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. ఆదివారం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలో బస్టాండ్ ఎదురుగా సిల్వర్ బావర్చి హొటల్ ను వారు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యేలు మాట్లాడుతూ పరిశుభ్రమైన, నాణ్యమైన పదార్థాలను సరసమైన ధరలకు ప్రజలకు అందించాలని సూచించారు. హొటల్ యజమాని మధుసూదన్ రెడ్డిని ఎమ్మెల్యేలు అభినందించారు. హొటల్ యజమాని మధుసూదన్ రెడ్డి ఇద్దరు ఎమ్మెల్యేలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ విజయలక్ష్మి ప్రవీణ్, ఎంపీపీ గోవర్ధన్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పాపారావు, జడ్పిటిసి గోవిందమ్మ గోపాల్ రెడ్డి, సర్పంచ్ గోపాల్ రెడ్డి, నాయకులు గోపాల్, వాసుదేవ్ కన్నా, రాఘవేందర్ పాల్గొన్నారు.



## ప్రగతి రిసార్ట్స్‌లో నిర్వహించిన యాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలే యాదయ్య

చేవెళ్ల...జూలై 2 వాయిస్ టుడే ,శంకర్పల్లి మండలం పొద్దుటూరు గ్రామం ప్రగతి రిసార్ట్స్ లో శ్రీమహాగ్ని చయన పూర్వక సర్వపృష్ఠ సర్వస్తోమ అప్తోర్యామ ఉత్కృష్ట సోమయాగం చైర్మన్ డా జి బి కే రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ పూజలో చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. 3వ తేదీ నుండి 13వ తేదీ వరకు యాగాలు జరుగుతాయని చైర్మన్ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ దైవచింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు.

## శంకర్‌పల్లిలో టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి



చేవెళ్ల..జూలై 2 వాయిస్ టుడే శంకర్పల్లి పట్టణ పిఎస్ పరిధిలో టిప్పర్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన రామంతపూర్ లో చోటుచేసుకుంది. ఎస్సై సంతోష్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన జొన్నాడ అనిల్ గౌడ్ (30) రోజు మాదిరిగా వ్యాపార పని నిమిత్తం రామంతపురానికి వెళ్ళాడు. ఇంటికి తిరుగు ప్రయాణంలో వెనక నుండి టిప్పర్ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## ప్రభుత్వ అధికారులు రైతులను ఆదుకోవాలి

### బిజెపి సీనియర్ నాయకులు వట్టూరు మల్లేష్ యాదవ్



మెదక్ తూప్రాన్ వాయిస్ టుడే న్యూస్ :- వ్యవసాయ బోరుబావుల వద్ద నుండి బోర్ మోటార్లతో సహా కేబుల్ సర్వీస్ వైర్లు స్టార్టర్లను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్తున్నారని రైతులు మొరపెట్టుకుంటున్నారు. మెదక్ జిల్లా తూప్రాన్ మండలంలోని వట్టూరు పొడాలపల్లి జండాపల్లి గ్రామాల రైతులు అనేక నష్టపోతున్నారని బిజెపి జిల్లా సీనియర్ నాయకులు వట్టూరు మల్లేష్ యాదవ్ మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు గ్రామాలలో దుండగులు సుమారు 4 బోర్ బావుల వద్ద నుండి విలువైన కేబుల్ వైర్లను ఎత్తుకెళ్లారన్నారు. వానకాలం సీజన్ ప్రారంభమైన దశలో వరి పంటలు సాగు చేసుకోవడానికి రైతులు సిద్ధమైన తరుణంలో కేబుల్ వైర్లు సర్వీస్ వైర్లను ఎత్తుకెళ్లడంతో రైతులు అయోమయ పరిస్థితిలో ఉన్నారని మల్లేష్ యాదవ్ వాపోయారు. ఇప్పటికైనా పోలీస్ శాఖ గ్రామాలలో సైతం ఒక రెండు సార్లు పెట్రోలింగ్ చేసినట్లయితే దొంగతనాలను అరికట్టడానికి వీలవుతుందని మల్లేష్ యాదవ్ అన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు తగు చర్యలు చేపట్టాలని లేనియెడల మా బిజెపి పార్టీ తరపున రైతులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని చేపడతామని మల్లేష్ యాదవ్ డిమాండ్ చేశారు.

## బీబీనగర్ మండలంలో ముఖ్య తెలుగుదేశం పార్టీ మండల నాయకుల సమావేశం

(వాయిస్ టుడే 02 : జూలై) ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఇంచార్జ్ మన్నే సంజీవరావు మరియు రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి సురకంటి జంగారెడ్డి హాజరై పూర్తిస్థాయి బిబి నగర్ మండల కమిటీ వేయడం జరిగింది మండల తెలుగుదేశం పార్టీ జొన్నవాడ భాస్కర్ రెడ్డి అధ్యక్షుడు, రావుల బసవయ్య ఉపాధ్యక్షుడు, డి రామస్వామి ఉపాధ్యక్షుడు , వీరేశం ప్రధాన కార్యదర్శి, గడ్డం సత్యనారాయణ కోశాధికారి, చిలివేరు బాలయ్య కార్యనిర్వాహక కార్యదర్శి, రామచంద్రం ముదిరాజ్ కార్యదర్శి , నరసింహ గౌడ్ కార్యదర్శి, మొత్తం తొమ్మిది మందితో మండల కార్యవర్గాల్ని పూర్తిస్థాయిలో వేయడం జరిగింది .

# మూగబోయిన ఉద్యమ గానం సాయి చందుకి నివాళులర్పించిన BRS నాయకులు



దుబ్బాక (వాయిస్ టుడే): న్యూస్ జూలై 2, సిద్దిపేట జిల్లా అక్బర్ పేట భూంపల్లి భారత్ రాష్ట్ర సమితి పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయి చందు కి నివాళులు అర్పించిన నాయకులు. ఆటపాటలతో తెలంగాణ ఉద్యమం ముందుకు సాగడంలో BRS పార్టీ ఎదుగుదలలో సాంస్కృతిక అడుగులు వేసిన ప్రముఖ ప్రజా గాయకుడు తెలంగాణ రాష్ట్ర సమస్త చైర్మన్ సాయి చందు మౌర్య కి కొవ్వొత్తుల ర్యాలీ ఫోటోకు నీ వాళ్ళు అర్పించడం మరియు ఇట్టి నీవాళ్లు అర్పించిన కార్యక్రమంలో జీడిపల్లి రవి , మండల పార్టీ అధ్యక్షుడు, BRSV దుబ్బాక నియోజకవర్గం అధ్యక్షులు పాపాన్ని సురేష్ గౌడ్, భాగస్వామ్య నిర్వహణలో BRS% పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గుండావెల్లి ఎల్లారెడ్డి, దుబ్బాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ షేర్ల కైలాసం, సీనియర్ నాయకులు ర్యకం శ్రీరాములు, పంజాల శ్రీనివాస్ గౌడ్ , చింతల కృష్ణ, గ్రంథాల కమిటీ మెంబర్ బోయ శ్రీనివాస్, విజిలెన్స్ కమిటీ మెంబర్, దుబ్బరాజం, టెలికాంబోర్డు పాతూరు శ్రీనివాస్ గౌడ్, సర్పంచి పోతానక రాజయ్య, పెరక మధు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, సిద్ధి రాములు దేవరాజు దేవాలయ కమిటీ డైరెక్టర్లు పాతూరి తిరుపతి గౌడ్, స్వామి, ఆత్మ కమిటీ డైరెక్టర్ జీడిపల్లి కిషన్, మండల కుమార్, సురేష్ ,రామచంద్రం ,నాగరాజు, మల్లేశం, భీమ్ రావు, నర్సింలు, జైపాల్ రెడ్డి, శ్రీనివాస్ ,పూజారి, మల్లేశం, నిజాం వెంకటపతి, ఇతర ముఖ్య నాయకులు యువకులు, విద్యార్థులు పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ప్రేమ పేరిట యువతిపై బీజేపీ నేత అత్యాచారం

### అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు

సిద్దిపేట అర్బన్, జూలై 2: సోషల్ మీడియా ద్వారా ఓ యువతితో పరిచయం పెంచుకొని ఆమెపై అత్యాచారానికి పాల్పడిన బీజేపీ నేతపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆదివారం సిద్దిపేటలో ఏసీపీ దేవారెడ్డి కేసు వివరాలను వెల్లడించారు. సిద్దిపేట అర్బన్ మండలం రంగధాంపల్లికి చెందిన మల్లం శ్రీనివాస్ సిద్దిపేట జిల్లా బీజేపీ సోషల్ మీడియా కో కన్వీనర్‌గా పనిచేస్తున్నాడు. ఏడాది క్రితం సమీప గ్రామానికి చెందిన యువతితో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం పెంచుకున్నాడు. రోజూ ఫోన్ కాల్స్, మెసేజ్‌లు చేస్తూ ప్రేమిస్తున్నానంటూ నమ్మించాడు. కొద్దిరోజుల కింద బాధితురాలు తన అక్క వద్దకు వెళ్తుండగా తానే దింపి వస్తానని కారులో ఎక్కించుకున్న శ్రీనివాస్ ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం రెండు, మూడు సార్లు అత్యాచారం చేశాడు. ఈ క్రమంలోనే తనను వివాహం చేసుకోవాలని కోరగా శ్రీనివాస్ తిరస్కరించడంతో బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

## భక్తజన సంద్రం.. యాదగిరి క్షేత్రం

### ధర్మ దర్శనానికి నాలుగు గంటల సమయం

### కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే రూ.55.03 లక్షల విరాళం



యాదగిరిగుట్ట, జూలై 2: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం ఆదివారం భక్త జన సంద్రమైంది. సెలవు రోజు కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు నృసింహుడిని దర్శించుకున్నారు. దాంతో ఆలయ తిరువీధులు, దర్శనాల క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. ధర్మదర్శనానికి నాలుగు గంటలు, ప్రత్యేక దర్శనానికి సుమారు రెండు గంటల సమయం పట్టింది. 40 వేల మంది యాదగిరీశుడిని దర్శించుకోగా, ఆలయ ఖజానాకు రూ. 54,03,802 ఆదాయం సమకూరింది. మరోవైపు స్వామి వారికి నిత్యపూజలు వైభవంగా జరిగాయి. మంత్రి మల్లారెడ్డి, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు యాదగిరీశుడిని దర్శించుకున్నారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానందగౌడ్ కుటుంబసమేతంగా స్వామిని దర్శించుకుని, యాదగిరీశుడి విమానగోపురం బంగారు తాపడం కోసం రూ. 55,03,500 విరాళాన్ని అందజేశారు. స్వామివారి దర్శనం అనంతరం మంత్రి మల్లారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ భావి భారత ప్రధాని అని అన్నారు. తెలంగాణలో కేసీఆర్ హ్యాట్రిక్ కొడతారని మల్లారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రధానాలయ విమాన గోపురం బంగారు తాపడానికి సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఇప్పటికే సుమారు రూ.5 కోట్ల విలువైన 10 కిలోల బంగారాన్ని విరాళంగా ఇచ్చినట్లు వెల్లడించారు. ప్రజాప్రతినిధులతో పాటు వచ్చిన కార్యకర్తలు, అభిమానుల కోసం మధ్యాహ్నం 800 వీవీఐపీ బ్రేక్ దర్శనం టికెట్లు విక్రయించారు. ఒక్కో టికెట్ విలువ రూ. 300 కాగా, వీటి ద్వారా ఆలయానికి రూ. 2.40 లక్షల ఆదాయం సమకూరింది.

**ప్రముఖుల పర్యటనతో భక్తుల పాట్లు:** యాదగిరిక్షేత్రాన్ని ఆదివారం పలువురు ప్రముఖులు సందర్శించడంతో సామాన్య భక్తులు నానా తంటాలు పడ్డారు. ఆలయంలో సెల్ఫీలు, ఫొటోలు దిగుతున్న ప్రజాప్రతినిధులు, కార్యకర్తలను కట్టడి చేయడంలో అధికారులు విఫలమయ్యారని, నిబంధనలు సామాన్య భక్తులకే వర్తింపజేస్తారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, గంటల తరబడి క్యూలైన్లో వేచి ఉండాల్సి రావడంతో కనీస సౌకర్యాలు లేక హైదరాబాద్‌కు చెందిన ఓ భక్తురాలు సొమ్మసిల్లి పడిపోయారు. దీంతో కుటుంబ సభ్యులు ఆమె ముఖంపై నీళ్లు చల్లి సపర్యలు చేశారు.

## జన గర్జన సభకు వెళ్లకుండా వి.హెచ్‌ను అడ్డుకున్న పోలీసులు

### పోలీసులతో వాగ్వాదానికి దిగి

### రెండుగంటలు స్టేషనులో ఉన్న విహెచ్ , కాంగ్రెస్ శ్రేనులు



ఖమ్మం రూరల్: ఖమ్మంలో నేడు కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న జన గర్జన సభకు వెళుతున్న సీనియర్ నాయకులు, కాంగ్రెస్ మాజీ ఎంపి హనుమంతరావును పోలీసులు అడ్డుకున్నారు. ఖమ్మం రూరల్ మండలం ఖమ్మం - సూర్యాపేట రహదారి వరంగల్ క్రాస్ రోడ్ పోలీస్ స్టేషన్ ఎదుట వాహనాలు తనిఖీ చేస్తుండగా హైదరాబాద్ నుంచి కార్లో వస్తున్న కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీ హనుమంతరావు ను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు వాగ్వాదానికి దిగిన హనుమంతరావు రెండు గంటల పాటు స్టేషన్ బయట ఉన్నారు. అప్పటికే కొద్దిమంది కాంగ్రెస్ నాయకులను, వాహనాలు పట్టుకుని వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో పోలీసులతో వాగ్వాదానికి దిగి వారందరినీ విడిపించుకుని ఖమ్మం సభకు వెళ్ళారు. సామరస్యంగా సభకు వెళుతున్న కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అడ్డుకోవడంతో ఆగ్రహించిన నాయకులు పోలీసుల జులు నసించాలని నినాదాలు చేశారు. అంత కలిసి హనుమంతరావు వెంట వెళ్ళారు.




## రోడ్డు పనులు వెంటనే ప్రారంభించకపోతే ఆందోళన ఉధృతం చేస్తాం

### పాదయాత్ర ప్రారంభ సభలో సిపిఎం నేత భూక్యా వీరభద్రం

ఖమ్మం: ఉసిరికాయలపల్లి సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో కోట మైసమ్మ ఆర్చి నుండి సీతారాంపురం వరకు మంజూరైన తారు రోడ్డు పనులు ప్రారంభించాలని గ్రామస్తులతో కలిసి సిపిఎం శ్రేణులు పాదయాత్ర కోట మైసమ్మ ఆర్చి నుండి సీతారాంపురం రోడ్డు వరకు నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వైరా నియోజకవర్గం ఇన్చార్జి భూక్యా వీరభద్రం జండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్డు పనులు వెంటనే ప్రారంభించక పోతే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేపడుతామని ప్రభుత్వానికి హెచ్చరించారు. కేటాయించిన నిధులు విడుదల చేయకుండా ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలని కోరారు.

## పాలేరు జలాశయంలో దూకి ఆత్మహత్య యత్నం చేయబోయిన యువతి

### కాపాడిన జాలర్లు



కూసుమంచి, జూలై 2 : సూర్యాపేట జిల్లా మోతే మండలం కు చెందిన ఓ యువతి పాలేరు జలాశయంలో పడి ఆత్మహత్య యత్నం చేసుకోబోవుగా కాపాడిన జాలరులు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై రమేష్ కుమార్ ఆ యువతతో మాట్లాడి వారి తల్లిదండ్రుల నెంబర్ తీసుకుని ఫోన్ చేసి పాలేరుకు రప్పించారు. ఎటువంటి కేసు నమోదు కాలేదన్నారు.

## తప్పుడు ప్రచారాలు చేస్తే చర్యలు తీసుకుంటాం


### -రురల్ ఏసీపీ బస్వారెడ్డి

ఖమ్మం: రాజకీయాల కోసం పోలీసులపై తప్పుడు ప్రచారాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రురల్ ఏసీపీ బస్వారెడ్డి అధివారం ఒక ప్రకటన లో తెలిపారు.కరుణగిరి వద్ద బారికేడ్లు పెట్టీ వాహన తనిఖీ చేస్తూ..సభకు ప్రజలను రాకుండా పోలీసులు అడ్డు పడుతున్నారని ఖమ్మం రూరల్ ఎస్ఐ వెంకటకృష్ణను మాజీ మంత్రి రేణుకా చౌదరి తోసేసినట్లు సామజిక మాధ్యమాలలో వస్తున్న వార్తలలో నిజం లేదని తెలిపారు.ఎస్ఐ వెంకటకృష్ణతో రేణుకా చౌదరి వివాదం మంటూ సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారాలు, ఆరోపణ చేస్తూ... పోలీసుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తించడం సరికాదని,దీనిని పూర్తిగా ఖండిస్తున్నమని ఆయన పెర్కొన్నారు. ఇలాంటి చర్యలను ఉపేక్షించేది లేదని చట్టప్రకారం చర్య తీసుకుంటామని హెచ్చరించారు.



## ఎస్ఎస్సి బ్యాచ్ పూర్వపు విద్యార్థుల సమ్మేళనం

మెదక్ తూప్రాన్ వాయిస్ టుడే న్యూస్ :- పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందర్భంగా మెదక్ జిల్లా గజ్వేల్ నియోజకవర్గం తూప్రాన్ పట్టణ ZPPHS ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1991-1992 బ్యాచ్ SSC విద్యార్థులు తమ గురువులను సత్కరించడం జరిగింది. గురువులు రిటైర్డ్ ఉపాధ్యాయులు రామకృష్ణయ్య రాజయ్య, జయరాములు లను శాలువాతో సన్మానించి 30 సంవత్సరాలు గడిచిన సందర్భంగా మేమెంటో అందజేయడం జరిగింది. అనంతరం పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తన చిన్నప్పటి జ్ఞాపకాలను గుర్తు చేస్తూ వారు చేస్తున్న ఉద్యోగాలు, వారి వారి పిల్లల చదువు ఉద్యోగాల గురించి చెబుతూ కాసేపు సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో సంతోష్ రెడ్డి, విజయ్ కుమార్, బ్రహ్మచారి ,సత్తి, మోహిజ్, నాగేందర్ రెడ్డి, శ్రీనివాస్, మల్లేష్, పూర్వపు విద్యార్థులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



## సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

అశ్వాపురం, జులై 2. (వాయిస్ టుడే న్యూస్ )భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలోని మల్లెలమడుగు, రామచంద్రపురం, సత్యనారాయణపురం, తుమ్మలచెరువు గ్రామాలలో ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు ఆదేశాల మేరకు పోడు భూములకు పట్టాలు మంజూరు చేసిన సందర్భంగా ఆదివారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోడి కృష్ణవేణి, ఉప సర్పంచ్ చావా వీరగావులు,బూర్గంపాడు మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుంపెన శ్రీను, మల్లెల మడుగు గ్రామ శాఖ అధ్యక్షులు మామిడి శ్రీను,తదితర బిఆర్ఎస్ పార్టీ నాయకులు, ఆదివాసి నాయకులు పాల్గొన్నారు.

## చందయిపేటలో గుడిసె దగ్ధం

చందయిపేట, జులై 2,23: మెదక్ జిల్లా. చేగుంట మండలం, చందయిపేట గ్రామంలో ఆదివారం జులై 2,సాయంకాలం సమయంలో పిట్టల కృష్ణ పూరి గుడిసె ప్రమాదవశాత్తు దగ్నమైంది. సుమారు ఆర్తి నష్టం లక్ష రూపాయల వరకు ఉంటుందని వారి ఇంట్లోని డబ్బులు, బీరువా, కిరాణం సామాగ్రి, వంట సామాగ్రి, మంచం,ఫ్యాన్లు, టీవీ, గ్యాస్ పొయ్యి, సెల్ ఫోన్లు పూర్తిగా కాలిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న చందయిపేట గ్రామ సర్పంచ్ స్వర్ణలత భాగ్యరాజ్ సంఘటన స్థలానికి చేరుకొని వారి కుటుంబాన్ని పరామర్శించారు. పూరి గుడిసె దగ్ధం కావడంతో రోడ్డున పడ్డ కుటుంబీకులు సర్పంచ్ స్వర్ణలత భాగ్యరాజ్ వారి కుటుంబాన్ని ఓదార్చారు. వారి కుటుంబానికి నేనున్నానంటూ భరోసా కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంట గ్రామ పంచాయతీ పాలకవర్గం ఉన్నారు.



## మూసాపేట్‌లో ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

మూసాపేట్: ప్రజలకు సేవ చేయడంలో ముమ్మా రెడ్డి ప్రేమ్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ ఎప్పుడు ముందుంటుందని ట్రస్ట్ అధినేత ప్రేమ్ కుమార్ వెల్లడించారు. మూసాపేట్ వార్డు కార్యాలయంలో నేడు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య పటేల్, రాష్ట్ర కార్యదర్శి తేల్ల హరికృష్ణ హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం 9 డివిజన్లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో అన్ని రకాల వైద్య పరీక్షలతో పాటు మందులను సైతం ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ఆపరేషన్ అవసరమైన వారికి స్వచ్ఛందంగా తమ సంస్థ ద్వారా ఆపరేషన్ సైతం చేయిస్తున్నామని నిర్వాహకులు వెల్లడించారు. ఇప్పటివరకు సుమారు 300 మందికి పైగా ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నట్లు తెలిపారు. వైద్య శిబిరంలో తమతోపాటు ముందుండి నడుస్తున్న వైద్య సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య పటేల్, మున్నూరు కాపు రాష్ట్ర కార్యదర్శి తెళ్ల హరికృష్ణ పటేల్, బిసి ఐక్య వేదిక కన్వీనర్ బాశెట్టి నర్సింగ రావు, మూసాపేట డివిజన్ కోఆర్డినేటర్ సప్పిడి వెంకటేష్, మేడ్చల్ జిల్లా సెక్రెటరీ తూము శైలేష్ కుమార్, బీసీ ఐక్యవేదిక కో కన్వీనర్ గున్నాల వినోద్ కుమార్, హరిబాబు, మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్ కుమార్, తూము విజయ్ కుమార్, జిల్లా మనోజ్, శ్రీకర్ రావు పాల్గొన్నారు.

## ఇమ్మానీయేలు చర్చికి రూ. 2లక్షల ఆర్థిక సాయం చేసిన ఎమ్మెల్యే కందాళ

కూసుమంచి, జూలై 2: కూసుమంచి మండల కేంద్రంలోని CSI ఇమ్మానీయేలు చర్చికి గతంలో ఇచ్చిన హామి మేరకు ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో చర్చి పాస్టర్ రెవరెండ్ రమేష్ బాబు మరియు సంఘ పెద్దలకు పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి గారు రూ,2 లక్షల ఆర్థిక సాయం ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందాళ మాట్లాడుతూ కుల, మత, ప్రాంతీయ భేదాలు లేకుండా అందరిని సమానంగా ఆదరిస్తానని, పాలేరు ప్రజలు ఇబ్బందులు పడకుండా నావంతు సహాయ, సహకారాలు అందిస్తాని ఆయన అన్నారు. కార్యక్రమంలో డి సి సి బి డైరెక్టర్ ఇంటూరి శేఖర్, టిఆర్ఎస్ మండల అధ్యక్షు వేముల వీరయ్య, మాజీ అధ్యక్షులు చాట్లా పరుశు రాం, CSI ఇమ్మానీయేలు చర్చి పెద్దలు తదితరులు పాల్గొన్నారు.